Rs. 12/- per copy

UESI

# విద్యార్థి జ్వాల

Vol. 28 - No.12

October 2022




## దేశం కోసం ప్రార్థిద్దాం

# స్వస్థత కోసం ...

దేశంలో ఒకవైపు వైరస్‌ల భయాలు, ఆర్థిక కుంభకోణాలు, లంచాలు, భ్రష్టుపట్టిన రాజకీయాలు, ఉగ్రవాదం, నిరుద్యోగం, యాక్సిడెంట్‌లు దేశాన్ని కుదిపేస్తుంటే మరోవైపు అక్రమ సంబంధాలు, కుటుంబాల్లో కలహాలు, మోసం, అసూయ, పగ, మొ॥ వాటి వలన దేశ ప్రజల్లో అశాంతి, భయం, గందరగోళ పరిస్థితులు ఏర్పడి నిద్రలేని రాత్రులతో జీవిస్తున్నారు. పైకి మంచిగానే కనబడుతున్నా లోలోపల వేదనను అనుభవిస్తున్నారు. మేము సంతోషంగా జీవిస్తున్నాము, మాకు సమస్యలు లేవని ధైర్యంగా చెప్పగలిగే వ్యక్తులు, కుటుంబాలు, రాష్ట్రాలు, దేశాలు ఈ ప్రపంచంలోనే లేవు.

ఈ అశాంతికి, అసమాధానానికి కారణం ఏంటి? మానవుని పాపమేనని బైబిల్ స్పష్టంగా చెబుతుంది. "నరుల చెడుతనము భూమిమీద గొప్పదనియు, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదని యెహోవా చూచెను" (ఆది. 6:5). అయితే మన దేశానికి, సమాజానికి, కుటుంబాలకు స్వస్థతలేదా? ఉంది! తప్పక ఉంది. అది ఎవరిద్వారా సాధ్యమంటే సర్వశక్తుడైన దేవుని ద్వారా, ఆయనను నమ్మిన వారి ద్వారానే. ఎందుకంటే ఆయన తనను నమ్మిన వారిని ఈ విధంగా చేయమంటున్నాడు. "నా పేరు పెట్టబడిన నా ప్రజలు తమ్ముతాము తగ్గించుకొని ప్రార్థన చేసి నన్ను వెదకి తమ చెడుమార్గములను విడిచిన యెడల, ఆకాశమునుండి నేను వారి ప్రార్థనను విని, వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును" (2 దిన. 7:14).

దేశము యొక్క స్వస్థతకు విశ్వాసి ప్రార్థనకు అవినాభావ సంబంధం ఉంది. దేవుని పిల్లలు తమ్మును తాము తగ్గించుకొని, దేవునిని వెదకి, తమ చెడుమార్గాల్ని విడిస్తే అప్పుడు దేవుడు వారి ప్రార్థన విని, వారి పాపాలను క్షమించి దేశాన్ని బాగుచేస్తాడు.

మన దేశంలో సంఘాలకు, రిజిస్టర్డ్ లేదా కాగితాల మీద ఉండే సంస్థలకు, వాటిలో ఉండే సభ్యులకు కొదువలేదు. వీటిల్లో నామకార్థమైన వాటి వలన, వ్యక్తుల వలన ఉపయోగం లేకపోగా సమస్యలే ఎక్కువ. యధార్థంగా ఆయనను సేవించే వారివలన, ప్రార్థించే వారి వలన కుటుంబాలలో, సంఘాలలో, సంస్థల్లో సంతోషం, సమాధానం ఉంటుంది. వారి ద్వారానే ఎందుకంటే వారు దేవునితో ఉంటూ, తమ్మును తాము తగ్గించుకొని, దేవుని వెదకి, చెడుమార్గాల్ని విడిచినవారు. మనం మన దేశములో, సమాజంలో, కుటుంబంలో, సంఘంలో, సంస్థలో సమాధానానికి, సంతోషానికి కారకులమేనా? లేక అసమాధానానికి కారకులమా?

నిస్వార్థమైన ప్రేమ, త్యాగం నిజమైన దైవభక్తినుండే వస్తాయి. దైవభక్తి దేవునితో ఉండే సంబంధం, సహవాసాన్ని బట్టి వస్తుంది. ఒక వ్యక్తి నిజదేవుడైన యేసుక్రీస్తుతో ఎంత ఎక్కువ సహవాసం కలిగివుంటాడో ఆ వ్యక్తి అంత నిజాయితీగా, నిస్వార్థంగా జీవిస్తూ, తోటివారిని ప్రేమిస్తూ, మొదటిగా వారి కొరకు ప్రార్థన చేస్తాడు. దేశాన్ని పాడుచేసే మతతత్వం, వ్యభిచారం,జారత్వం, అవినీతి, లంచగొండితనం, గురుభక్తి, కుల, వర్గ, ప్రాంతీయ బేధాలు నిర్మూలమయ్యేటట్లు విజ్ఞాపన చేస్తాడు.

ఎజ్రా, నెహెమ్యా, ఎస్తేరు, దానియేలు లాంటి భక్తులు ప్రార్థనను ఆయుధంగా చేసుకొని పతనమైన జీవితాలను కట్టారు. కూల్చబడిన గోడలను తిరిగి నిర్మించారు. మరణపు కోరల్లో చిక్కుకొన్న ప్రజానీకాన్ని రక్షించారు. జీవితంలో రాజీపడకుండా శరీరాలను అప్పగించి రాజ శాసనాలు రద్దుపరిచేలా చేశారు. సమాజాన్ని సంస్కరించారు. వారు చేసిన ప్రార్థనలకు రాజులు, అధికారులు తలొగ్గేలా చేశారు.

"తోటి మానవాళి లేక జీవుల పట్ల చేసే అమానుష లేక క్రూరమైన పాపం, వారిని ద్వేషించడం కాదు గానీ, వారిపట్ల ఉదాసీనత లేక అశ్రద్ధ వైఖరిని కనపరచడం అని అంటాడు" జార్జి బెర్నార్డ్ షా. మన దేశంలోని చెడు పరిస్థితులు, సమస్యల్లో ఉన్న ప్రజల పట్ల ఉదాసీనంగా ఉంటున్నామంటే పాపాన్ని చేస్తున్నట్లే. నా మట్టుకు నేను మీ నిమిత్తము ప్రార్థన చేయుట మానుట వలన యెహోవాకు విరోధముగా పాపము చేసినవాడనగుదును" అని సమూయేలు ప్రవక్త అంటున్నాడు (1 సమయేలు 12:23). కాబట్టి మనము సంపూర్ణభక్తియు మాన్యతయు కలిగి, నెమ్మదిగాను సుఖముగాను బ్రతుకు నిమిత్తము, అన్నిటికంటే ముఖ్యముగా మనుష్యులందరి కొరకును రాజులకొరకును అధికారులకొరకును విజ్ఞాపనము లును ప్రార్థనలును యాచనలును కృతజ్ఞతాస్తుతులును చేయుదము (1తిమోతి 2:1-2).

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల



Vol. 28, No.12 October 2022
A Publication of
UESI Publication Trust



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

November: Spicon Messages
December: Why Jesus is so unique?
January 2023: God's Guidance
February: Discipleship

**Note:** Please send your writeups on or before
**10th of every month**



## ప్రార్థన ద్వారా....



నీవు నేను ప్రపంచాన్ని ప్రభావితం చేయాలనేది దేవుని ప్రణాళిక. ప్రార్థన ద్వారా జరగబోయే స్పైకాన్‌లలో స్పీకర్స్ పక్కన నిలబడి (అజ్ఞాతంగా) వారిని బలపరచవచ్చు, వారి ద్వారా అనేకమందిలో దేవుడు తన ఆత్మకార్యం చేయడానికి నీవు దోహద పడవచ్చు. ప్రార్థన ద్వారా డిసెంబర్‌లో అమెరికాలో జరగబోయే 'అర్బానా మిషన్స్ కాన్ఫరెన్స్'ను అనేక మందికి ఆశీర్వాదంగా చేయవచ్చు. అక్టోబర్‌లో జరగబోయే నేషనల్ మిషన్స్ కాన్ఫరెన్స్‌లో అనేక మందితో దేవుడు మాట్లాడేటట్లు నీ ప్రార్థన ద్వారా సహాయపడవచ్చు. ప్రార్థనతో ఉక్రెయిన్‌లో యుద్ధంలో గాయపడిన శిశువును నీ చేతిలోకి తీసుకోవచ్చు. ఆసుపత్రిలో చాలాకాలం నుండి మంచం మీద ఉన్న ఓ నిర్భాగ్యులకు స్వస్థత చేకూరేటట్లు నీ ప్రార్థనతో పోరాడవచ్చు. నీ ప్రార్థనతో యుఇయస్ఐ-ఏపి ఎగ్జిక్యూటివ్ కమిటీని బలపరచవచ్చు, దేవుని చిత్తాన్ని వారు అమలు చేసేటట్లు వారికి సహాయాన్ని అందించవచ్చు. పరీక్షలు రాసే వారి పక్కన కూర్చొని వారి చేతిని బలపరచవచ్చు.

## లోపలి పేజీల్లో...


- స్వస్థత కోసం... - 2
- మన దేశం కోసం ప్రార్థన చేద్దాం - 4
- ప్రభువు ప్రార్థనా జీవితమే మనకు మాదిరి - 8
- వారి ప్రార్థన మనకు ఆశీర్వాదం - 12
- కుటుంబ ప్రార్థన - 16
- ఉపవాస ప్రార్థన - 20
- మన తరానికి సేవచేయడం - 23
- ప్రసంగ వేదికపై ప్రార్థనలేమి - 26
- వెలుగిచ్చే దీపాలు - 28
- క్రాస్ వర్డ్ పజిల్ - 30
- కోశాధికారి లేఖ - 31
- అద్భుతాలేవి- 32




# మన దేశం కోసం ప్రార్థిద్దాం

వేల్స్, యునైటెడ్ కింగ్‌డమ్‌లో భాగంగా ఉన్న ఒక చిన్న దేశం. ఇది తూర్పున ఇంగ్లాండ్, పశ్చిమాన అట్లాంటిక్ మహాసముద్రం, ఐరిష్ సముద్రంతో సరిహద్దులు పంచుకుంటుంది. 1904వ సం॥ వసంతకాలములో ఇవాన్ రాబర్ట్స్ అనే వేల్స్ యౌవ్వనస్థుడు అనేకసార్లు రాత్రి ఒంటిగంటకు నిద్రనుండి లేచి ఉదయం ఐదు గంటలు వరకు వారి దేశంకోసం ప్రార్థనలో పోరాడేవాడు. తర్వాత వేల్స్‌లో గొప్ప ఉజ్జీవం వచ్చింది.

ఈ ఉజ్జీవ ఫలితంగా సంఘాలన్ని ప్రార్థనకై కిక్కిరిసిపోయేవి. ఒక యవ్వనస్థుల ప్రార్థనా మీటింగ్‌లో పాస్టర్ జోసఫ్ జెన్కిన్స్‌గారు సాక్ష్యం చెప్పాలని యవ్వనస్థులను కోరాడు. కొన్నిరోజుల క్రితం ప్రభువును అంగీకరించిన ఫ్లోరీ ఇవాన్స్ అనే యవ్వనస్థురాలు లేచి అదురుతున్న కంఠ స్వరముతో "నేను యేసును నా హృదయమంతటితో ప్రేమిస్తాను" అని చెప్పింది. ఆ మాటల ద్వారా మిగిలిన యవ్వనస్థులందరి హృదయాల్ని దేవుడు కదిలించాడు. ఆ రోజుల్లో ఎంతో శక్తివంతమైన ఆత్మీయ మేలుకొలుపు కలిగి లక్షమంది ప్రజలు క్రీస్తును అంగీకరించారు. 1904వ సం॥ నవంబరు 7వ తేదీన మోరియా మందిరం ప్రజలచేత నిండి వారి ప్రార్థనా కూటము తెల్లవారు జామున మూడు గంటల వరకు కొనసాగింది. నెమ్మదిగా ఈ ఉజ్జీవం దగ్గరలోని బొగ్గు గనులకు వ్యాపించింది. బొగ్గు గనుల్లో

పనిచేసేవారు అపవిత్రమైన, దేవునిని దూషించే మాటలు మాట్లాడం మానివేసి బొగ్గుగనుల ద్వారాల మీద వాక్యాలు రాశారు. బైబిల్స్ కొరకు వేల్స్‌వారు నవంబరు, డిసెంబరు నెలల్లో బైబిల్ సొసైటీకి గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మూడురేట్లు ఎక్కువగా బైబిల్స్ ఆర్డర్ చేశారు. పార్టీలలో తాగటం లేదు. సారా అమ్మకాలు తగ్గిపోయాయి. యూనియన్స్ మధ్య కలహాలు సమసిపోయాయి. గ్లిన్‌నీట్‌లో ఇండిపెండెంట్ సంఘాల మధ్య 10-12 సంవత్సరాలుగా ఉన్న కలహాలు సమసిపోయి సంఘాల సేవకులు చేతులు కలిపి ఉమ్మడి ప్రార్థనా ఆరాధనలు జరుపుకొన్నారు. సాల్వేషన్ ఆర్మీ 1905 వ సం॥ జనవరి 19వ తేదీని ఒప్పుకోలు, తగ్గించుకొనే ప్రార్థనా దినముగా ఇంగ్లాండ్, ఐర్లాండ్, స్కాట్‌లాండ్, వేల్స్ అంతా నియమించారు. 1905లో ఫిబ్రవరి 2న లండన్ టైమ్స్ పత్రిక ఈవిధంగా వెల్లడించింది: వేల్స్ ఉజ్జీవం ఫలితంగా అనేకులు దుష్కార్యాలు, అన్యాయాలు చేయడం మానారు, ఉద్యోగుల్లో పని నైపుణ్యత పెరగడం యజమానులు గమనించారు. నేరాలు, తాగుడు తగ్గిందని జడ్జిగారు చెప్పారు. వేల్స్ ఉజ్జీవజ్వాల ఇంగ్లాండ్, ఐర్లాండ్, స్కాట్‌లాండ్‌లకు వ్యాపించింది. ప్రార్థనా మీటింగ్స్ ఎక్కువ అయ్యాయి.

డా. ఏటి పియర్సన్ ఓసారి ఇలా అన్నాడు, "ఏ దేశములోనైనా, ప్రాంతములోనైనా ఆత్మీయ మేల్కొల్పు ఐక్య ప్రార్థనద్వారే ఉద్భవించింది". క్రమమైన ఎడతెగని ప్రార్థనలద్వారా ఆదిమ సంఘకాలంలోనూ, చరిత్రలోనూ దేవుడు గొప్ప అద్భుతాలు చేశాడు. మనం యెడతెగక ప్రార్థిస్తే, అదే దేవుడు ఇప్పుడు మన భారతదేశం పట్ల కూడా అద్భుతకార్యాలు చేస్తాడు.

## మనం ప్రతి దినం ప్రార్థించాల్సిన విషయాలు

### 1. పశ్చాత్తాపము (ప్రాయశ్చిత్తార్థ పశ్చాత్తాపము)

ఎజ్రా, నెహెమ్యా, దానియేలువలె మన ప్రజల పాపములను మనపై వేసికొని, మనము ఒప్పుకొని ప్రార్థించాలి.

ఎజ్రా. 10:1 – ఎజ్రా ఏడ్చుచూ దేవుని మందిరము ఎదుట సాష్టాంగపడుచు, పాపమును ఒప్పుకొని ప్రార్థన చేసెను. నెహె. 1:6 – నీకు విరోధముగా పాపము చేసిన ఇశ్రాయేలు కుమారుల దోషమును నేను ఒప్పుకొనుచున్నాను.



దాని. 9:20 – నేను ఇంకా పలుకుచు ప్రార్థన చేయుచు, నా దేవుడైన యెహోవా ఎదుట నా పాపమును నా జనము యొక్క పాపమును ఒప్పుకొనుచు నా దేవునికి విజ్ఞాపన చేయుచుంటిని.

### మన దేశాన్ని పాడుచేసే 7 ఘోరపాపాల్ని ఒప్పుకొని ప్రార్థిద్దాం.

1. విగ్రహారాధన అనే పాపం నిర్మూలించబడేటట్లు.
2. వ్యభిచారము, జారత్వమనే భయంకర పాపము నిర్మూలించబడేటట్లు.
3. మత్తు పదార్థముల బానిసత్వమునుండి ప్రజల విడుదల కొరకు.
4. మన ప్రజలను నాశనము చేసే అవినీతి నిర్మూలన కొరకు.
5. మన దేశములో ఎక్కువగా ప్రబలమవుచున్న గురు భక్తి నిర్మూలన కొరకు .
6. మన ప్రజలను పాడుచేయుచున్న కుల, మత, వర్గ, ప్రాంతీయ భేదాలు సమసిపోయేటట్లు.
7. మన ప్రజలను, యువకులను పాడుచేస్తున్న మీడియా, ఇంటర్నెట్ పాపం నిర్మూలమయ్యేటట్లు ప్రార్థిద్దాం.

### 2. సాతానును, వాని కార్యాలను బంధించడం

దేవుడు ఇచ్చిన అధికారంతో అపవాది శక్తులను, కార్యాలను బంధించడం. యెహోషువ, దావీదుల వలె దేవుని కొరకు యుద్ధములు చేసినట్లు దేవుని

సేవకులు, దేవుని ప్రజలు, ఆత్మీయ పోరాటం చేసే దేవుని సైన్యమువలె సిద్ధపడేటట్లు ప్రార్థించడం (మత్తయి. 18:18-20; యెహోషువ. 1:6).

మార్కు 3:27 - ఒకడు బలవంతుడైనవానిని మొదట బంధించితేనే తప్ప ఆ బలవంతుని యింట జొచ్చి వాని సామాగ్రి దోచుకొననేరడు.

ఎఫెసీ. 6:12 - ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదుగాని ప్రధానులతోను అధికారులతోను ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాధులతోను ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము.

### 3. ఏకత్వము కొరకు

ప్రభువు ప్రార్థించినట్లు ప్రపంచంలోని మన దేశములోని ప్రభువు బిడ్డలందరూ(క్రైస్తవులందరూ) ఏకత్వము, ఐక్యత కలిగి ఉండేటట్లు ప్రార్థిద్దాం.

యోహా. 17:20,21 - మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు తండ్రీ, నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమైయుండవలెనని... ప్రార్థించుచున్నాను.

### 4. రూపాంతరము కొరకు

అపోస్తలుడైన పౌలు రోమా. 12:1,2లో చెప్పినట్లు దేవుని ప్రజలు నామకార్థ క్రైస్తవ(విశ్వాస) జీవితాన్ని విడిచి, రూపాంతరం చెందేటట్లు వారి కొరకు ప్రార్థించాలి.

ఎఫెసీ. 4:13 - పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకును...

### 5. దేశము యొక్క స్వస్థత కొరకు

మన భారతదేశము కొరకై ప్రార్థించాలి.

2 దిన. 7:14 - నా పేరు పెట్టబడిన నా జనులు తమ్మునుతాము తగ్గించుకొని, ప్రార్థన చేసి, నన్ను వెదకి, తమ చెడుమార్గములను విడచినయెడల ఆకాశమునుండి నేను వారి ప్రార్థన విని, వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును.

### మన భారత దేశానికి అవసరమైన 7 స్వస్థతలు కొరకు ప్రార్థించడం

1. భౌతికమైన స్వస్థత కొరకు
2. మానసిక స్వస్థత కొరకు
3. భావోద్రేకపరమైన స్వస్థత కొరకు
4. ఆత్మీయ స్వస్థత కొరకు
5. సంబంధబాంధవ్యాల స్వస్థత కొరకు
6. సామాజిక స్వస్థత కొరకు
7 దేశ స్వస్థత కొరకు

### 6. దేవుని కరుణకై మొర్రపెట్టుట

బండసందులలో నిలువబడి, దేవుని ఉగ్రత ఆగేటట్లు, దేవుని ఉగ్రత నుండి దేశ ప్రజలు రక్షణ పొందేటట్లు కన్నీటితో ప్రార్థించడం (యెష. 62:6,7; యెహెజ్కేలు 33:7).

యెహెజ్కేలు 22:30,31 - నేను దేశమును పాడుచేయకుండునట్లు ప్రాకారమును దిట్టపరచుటకును, బద్దలైన సందులలో నిలుచుటకును తగినవాడెవడని నేనెంత విచారించినను...

సంఖ్యా. 16:48 - అతడు చచ్చినవారికిని బ్రతికియున్నవారికిని మధ్యను నిలువబడగా తెగులు ఆగెను.

### 7. కడవరి వర్షము, ఉజ్జీవము కొరకు

దేవుడు వాగ్దానము చేసిన కడవరికాల వర్షము కొరకు, ఉజ్జీవము కొరకు భారముతో ప్రార్థించుట. జెకర్యా. 10:1 - కడవరి వానకాలమున వర్షము దయచేయుమని యెహోవాను వేడుకొనుడి.

యోవేలు. 2:28 - తరువాత నేను సర్వజనుల మీద నా ఆత్మను కుమ్మరింతును.

### విజ్ఞాపన చేసేవారు కావాలి

దైవజనుడైన మోషే హోరేబు పర్వతముపై దేవుని సన్నిధిలో నిలిచి, దేవుని ప్రజల దుస్థితిని బట్టి విలపించాడు. తన ప్రజల పాపాన్ని క్షమించమని లేనియెడల తన పేరును జీవగ్రంథములోనుండి తుడిచివేయుమని అతడు దేవుని బ్రతిమాలి వేడుకొన్నాడు.

దైవజనుడైన ఏలీయా కర్మెలు పర్వతంపై దేవుని మార్గముల నుండి తప్పిపోయి, దేవుని పరిశుద్ధ నామమును తృణీకరించిన దేవుని ప్రజల ఎదుట నిలిచి, బయలు ప్రవక్తలను పిలిపించి, వారి దేవుని నిరూపించమని సవాలు విసిరాడు.



దైవజనుడైన ఏలీయా ప్రజలకు ఒకే సత్యసజీవ దేవున్ని నిరూపించడానికి దేవుని పక్షాన నిల బడగా, దైవజనుడైన మోషే దేవుని నుండి క్షమాపణ, రక్షణ కొరకై బ్రతిమాలడానికి ప్రజల పక్షాన నిలబడ్డాడు.

ఈ దుర్దినాలలో దేవుడు ఇటువంటి వారి కొరకు అనగా, పాపులైన ప్రజల పక్షముగా దేవుని ఎదుట నిలబడేవారి కొరకు, దేవుని పక్షముగా ప్రజల ఎదుట సవాలు కరంగా నిలబడే వారికొరకు వెదకుచున్నాడు. “నేను దేశమును పాడుచేయకుండునట్లు ప్రాకారములను దిట్టపరచుటకును, బద్దలైన సందులలో నిలుచుటకును తగినవాడెవడని ఎంత విచారించినను..” (యెహెజ్కేలు. 22:30) ప్రకారము దేవుడు బద్దలైన సందులో నిలిచి, రోదించేవారి కొరకు ఎదురుచూచుచున్నాడు.

మనము చరిత్రను తరచి చూస్తే, ప్రజల పక్షాన దేవుని ఎదుట విలపించి, విజ్ఞాపన చేసి, వారి జీవితకాలములో గొప్ప ఉజ్జీవాన్ని అనుభవించిన గొప్ప దైవజనులను చూడగలం.

## ముగింపు

ప్రియమైన దైవసేవకులారా, దేవుని ప్రజలారా, దేవుని ఎదుట, బద్దలైన సందులో నిలబడి ఉజ్జీవం కొరకై విజ్ఞాపన చేయడం ఇప్పుడు మన వంతు. మనకున్న స్వల్పమైన పరిచర్యలతో సంతృప్తి చెందడానికిది సమయం కాదు. ఇప్పుడు ఇది అనుకూల సమయము, దేవుని సమయము, దేవుడు దర్శించే కాలము. ఇప్పుడు మనము విశ్వాసవీరులైన గొప్ప దైవజనుల మార్గములో మన భారతదేశంలో ఉజ్జీవం కొరకు మన జీవితాలను పానార్పణముగా చేస్తామో లేక కేవలం అల్పమైన, నిష్ప్రయోజనమైన వాటిని చేస్తూ మన జీవితాలను వ్యర్థపరచుకుంటామో మన చేతుల్లోనే ఉంది.

**'భారతదేశమా! మేలుకో' అనే పుస్తకం నుంచి**

**– పాస్టర్. జి. దేవరాజు,** విజయవాడ

నేషనల్ ప్రేయర్ అండ్ చర్చ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇనీషియేటివ్ టీమ్ అండ్ గ్లోబల్ డే ఆఫ్ ప్రేయర్ టీమ్

ఆచారంగాను, అలవాటుగాను ప్రార్థించడం, కొద్దిగా ప్రార్థించడం, సమయాన్ని చూచుకొంటూ హడావుడిగా ప్రార్థించడం, భారంతో కాకుండా, తేలికగా ప్రార్థించడం, ఆత్మతో కాకుండా పెదవులతో ప్రార్థించడం, ఆత్మీయ మేళ్ళకోసం కాకుండా లౌకిక సుఖ భోగాలకోసం ప్రార్థించడం, ఆత్మల కోసం కాకుండా స్వార్థం కోసం ప్రార్థించడం ఎలాంటి ఫలితాలను ఇవ్వదు. ఎలాంటి క్షేమాన్ని కలుగజేయవు గాని అవి నష్టాన్ని కీడునే కలుగజేస్తాయి.

– జార్జిముల్లర్

అనేకమంది క్రైస్తవులు విశ్వాసజీవితంలో, విశ్వాసపు పరుగులో వెనుకబడడానికి, ప్రాపంచిక శోధనలను జయించ లేకపోవడానికి, పాతస్వభావానికి పదేపదే తలవంచడానికి, సాతానుడి ముందు చిత్తుచిత్తుగా ఓడిపోయి కుప్పకూలి పోవడానికీ కారణం కేవలం ప్రార్థనా లేమి మాత్రమే.

– ఆండ్రూ ముర్రే

పరిస్థితులన్నీ ప్రతికూలంగా మారినప్పుడు, నీ చుట్టూ గాఢాంధకారం ఆవరించినప్పుడు, నీవారనుకున్నవారు నీకు వీపు మళ్ళించినప్పుడు, నీ ముందున్న ద్వారాలన్నీ మూసుకొని పోయినప్పుడు ఏ మార్గం నీకు కన్పించనప్పుడు నీవు నిరాశచెందకు. సమస్తం విఫలమైనప్పుడు ఒకే ఒక్క అవకాశం నీకోసం ద్వారాలను తెరుచుకొని ఉంది. నీ అవకాశాలన్నీ విఫలం చెందినా అది ఎన్నటికీ విఫలం చెందదు. అదే ప్రార్థన. కాబట్టి నీకేమి కావాలో, నీవేమి ఆశిస్తున్నావో , అది నీ కోసం కావచ్చు, ఇతరుల కోసం కావచ్చు. “అడుగుడి మీకియ్యబడును”

– జాన్‌వెస్లీ

పరిశుద్ధుల ప్రార్థనలు రాబోవు తరాన్ని భీకరమైన పాపపు తుఫానులనుండి దుష్టత్వపు అలలనుండీ సంరక్షిస్తాయి. ప్రార్థనాపరులు కాని అవిశ్వాసులైన తల్లిదండ్రుల పిల్లలకు ఎంతో శ్రమ! ప్రార్థనా స్వాస్థ్యాన్ని తమకు వదిలి వెళ్ళిన తల్లిదండ్రుల పిల్లలు ఎంతో ధన్యులు!

–ఇ.యం.బౌండ్స్

# ప్రభువు ప్రార్థనా జీవితమే మనకు మాదిరి

బైబిల్ గ్రంథం ఆరంభం నుండి చివరి వరకు గొప్ప ప్రార్థనలతో నిండి ఉంది. పితరుల ప్రార్థన, ప్రవక్తల ప్రార్థన, రాజుల ప్రార్థన, ఇతర నాయకుల ప్రార్థన, మనుష్యకుమారునిగా యేసయ్య ప్రార్థన, శిష్యుల ప్రార్థన, అపోస్తలుల ప్రార్థన, ఆది సంఘం ప్రార్థనల ద్వారా మనము ప్రార్థన యొక్క ప్రాముఖ్యత, ప్రార్థన చేసే విధానం గూర్చి నేర్చుకొంటాము, ప్రార్థన చేయడానికి పురికొల్పబడతాము. అంతే కాకుండా సమకాలీన దైవజనుల ప్రార్థన కూడా మనకు ఎంతో ప్రోత్సాహకరం.

అయితే దైవమానవునిగా వచ్చిన యేసుప్రభువు యొక్క ప్రార్థనా జీవితం మనకు మరెంతో స్ఫూర్తి నిస్తుంది కదా! అసలు యేసుప్రభువు దేవునిగా ప్రార్థన చేయాల్సిన అవసరం ఉందంటారా? ఈయన దేవుడై ఉండి ఎవరికి ప్రార్థన చేశాడు, ఎప్పుడెప్పుడు ఏయే విషయాల కోసం ప్రార్థన చేశాడు? ఆయన ప్రార్థనా జీవితం మనం ఎలా అలవర్చుకోవాలి? ఒక విశ్వాసిగా ప్రార్థన ఎందుకని అంత ప్రాముఖ్యమైనది అనే విషయాలు ఈ ఆర్టికల్‌లో చూద్దాం.

## మన ప్రార్థనకు మాదిరి ప్రభువే

మనం విశ్వసించే దేవుడు త్రియేక దేవుడు. త్రిత్వంలోని ముగ్గురు వ్యక్తుల మధ్య చక్కటి సహవాసం, చక్కటి భావ వ్యక్తీకరణ, సాన్నిహిత్యం చూస్తాం. త్రిత్వంలోని ముగ్గురు వ్యక్తులు దైవత్వంలో, ఉనికిలో సమానమైనప్పటికీ వారి పనిలో భిన్నత్వం కనిపిస్తుంది. తండ్రి ప్రణాళిక వేస్తే, కుమారుడు వాటిని నెరవేరిస్తే, పరిశుద్ధాత్ముడు దానికి అనుగుణంగా పని చేస్తున్నట్లు కన్పిస్తుంది. కుమారుడు తన పనిని నెరవేర్చే విషయంలో పూర్తిగా ప్రార్థన ద్వారా తండ్రిపై ఆధారపడినట్లు చూస్తాము. నరావతారిగా ఈ భూమి మీద ప్రభువు తన బాల్యం నుండి బ్రతికినంత కాలం, ఆఖరి క్షణం సిలువ మీద చనిపోతుండగా కూడా ప్రార్థనలో



తండ్రితో సంబంధం కలిగి ఉన్నాడు. ఇది మన దేవుని తత్వం. ఇదే మన ప్రార్థన జీవితానికి మాదిరి.

ప్రభువు దేవుడైయుండి మనతో మానవునిగా అన్ని విషయాలలో సహానుభవం గలిగిన వాడుగా ఉన్నాడు. ఆయన కూడా మనలాగే సవాళ్ళు ఎదుర్కొన్నాడు. బాధలు భరించాడు, ఇబ్బందులు, శ్రమలు, రోగం, హింస లాంటి అనుభవాలు మనవలె ఆయనకున్నాయి. వీటన్నిటిని ప్రభువు ప్రార్థన ద్వారా ఎదుర్కొన్నట్లు సువార్తల్లో చూస్తాము.

అందుకే ఆయనను గూర్చి హెబ్రీ గ్రంథకర్త ఈవిధంగా రాశాడు "శరీరధారియై ఉన్న దినములలో మహారోదనముతోను, కన్నీళ్ళతోను తనను మరణము నుండి రక్షింపగలవానికి ప్రార్థనలను, యాచనలను సమర్పించి భయభక్తులు కలిగియున్నందున ఆయన అంగీకరింపబడెను (హెబ్రీ 5:7). నిత్యత్వంలో ఉన్న తత్వంలోని సంబంధం భూమి మీద కొనసాగిస్తూ ఆయన విధేయత నేర్చుకొన్నాడని రాయబడింది.

## యేసుక్రీస్తు ఎవరికి ప్రార్థన చేశాడు?

లేఖనాలలో చూస్తే యేసుప్రభువు చేసిన ప్రార్థనలోను, శిష్యులకు నేర్పించిన ప్రార్థనలోను ఆయన పరలోకపు తండ్రిని సంబోధిస్తూ చేసినట్లు చూస్తాము. అంటే ప్రార్థన పరలోకమందున్న తండ్రితో ఉన్న వ్యక్తిగత సంబంధంలో నుండి వస్తుంది. క్రీస్తుప్రభువుని రక్షకునిగా అంగీకరించకుండా చెల ంవడే ప్రార్థన - అలవాటు ప్రార్థన లేక కృత్రిమమైన ప్రార్థనగా ఉంటుంది.

## యేసుక్రీస్తు ప్రార్థనలు

ప్రభువు భూమి మీద జీవించిన కాలంలో ఆయన ప్రార్థనా జీవితాన్ని గూర్చి సువార్తలన్నిటిలో ఎక్కువగా లూకా రాసిన సువార్తలో చూస్తాము. వాటిల్లో ప్రాముఖ్యమైన వాటిని గమనిద్దాం.

**1. బాప్తిస్మ సమయంలో ప్రార్థన (లూకా 3:21)**: ప్రజలందరు బాప్తిస్మము పొందినప్పుడు యేసు కూడా బాప్తీస్మము పొంది, ప్రార్థన చేయుచుండగా ఆకాశము తెరువబడింది. ప్రియమైన కుమారుని గూర్చి తండ్రి సాక్షమిచ్చినట్లు తెలుస్తుంది.

**2. పరిచర్య ఆరంభానికి ముందే ప్రార్థన (లూకా 4:1)** ప్రభువు తన పరిచర్యను 40 దినాలు ఉపవాస ప్రార్థనలో గడిపిన తర్వాత ఆరంభించినట్లు చూస్తాము.

**3. వాక్యం చెప్పడానికి, రోగాలు బాగు చెయ్యడానికి (లూకా 5:14,15):** ప్రజలు వాక్యం వినడానికి సమూహాలుగా వచ్చినప్పుడు, రోగులు స్వస్థత కోసం వచ్చినప్పుడు ఆయన ప్రార్థించడానికి అరణ్యానికి వెళ్ళాడు.

**4. శిష్యులను ఎంపిక చేసే ముందు (లూకా 6:12):** తన తరువాత సక్సెసర్స్ ఉండటానికి కీలకమైన వ్యక్తులను ఎన్నుకొనే విషయంలో ముందు రోజు రాత్రంతా ప్రార్థన చేశాడు

**5. దైవ ప్రత్యక్షతను శిష్యులకు బయలుపరచే నేపథ్యంలో (లూకా 9:18,29):** ఆయన ప్రార్థిస్తూ ఉండగా ఆయన ముఖరూపము మారిందని రాయబడింది. యెరూషలేములో జరగబోయే సంగతులను వారికి తెలియజేశాడు.

**6. 70 మంది శిష్యులకు అధికారమిచ్చే సందర్భంలో (లూకా 10:21):** 70 మంది శిష్యులను నియమించి ఇద్దరిద్దరినిగా పరిచర్యకు పంపిన సందర్భంలో వారు తిరిగివచ్చిన తరువాత వారికి తన అధికారాన్ని అనుగ్రహించానని చెప్పిన తరువాత పరిశుద్ధాత్మలో ఆనందించి వారి నిమిత్తం ప్రార్థించాడు.

**7. యేసుప్రభువు ప్రార్థనే శిష్యులకు ప్రేరణ (లూకా 11)**: శిష్యులు ప్రభువు ప్రార్థనా జీవితం చూసి ఎంతగానో ప్రేరేపించబడి వాళ్ళు ఆయనలా ప్రార్థన చేయడం నేర్పించమన్నారు. అందుకే శిష్యులు ప్రభువు పరిచర్యకు ప్రార్థన ప్రాముఖ్యమనే విషయాన్ని గుర్తించారు.

**8. ప్రభువు సిలువకార్యానికి ముందు (లూకా 22:44):** ఒలీవల కొండకు వెళ్ళి వేదనతో ప్రార్థన చేశాడు. సిలువ మరణం పొందునంత బాధతో, అవమానంతో యేసుప్రభువు తన సిలువ కార్యం నెరవేర్చడంలో ఉన్న తీవ్రత ఆయన ప్రార్థనలో వ్యక్తం చేశాడు.

## ప్రభువు ప్రార్థన (యోహాను సువార్త 17వ అధ్యాయంలో )

ప్రభువు తన పరిచర్య నిమిత్తము దేవుడు తనకు అప్పగించిన పనిని నెరవేర్చే నిమిత్తం ప్రార్థనలో దేవుని మీద ఆధారపడ్డాడు.

యోహాను సువార్త 17వ అధ్యాయంలో ప్రభువు ప్రార్థనలో భవిష్యత్తు తరాలలో ఏర్పడబోయే

సంఘం పట్ల ఆయన దర్శనము ఎంతో స్పష్టంగా వ్యక్తపరచబడుతుంది. ఈ ప్రార్థనలో మనం, మన తరువాత తరాలు కూడా ఉన్నాయి.

బైబిల్ అంతటిలో యోహాను 17వ అధ్యాయం అతి ప్రాముఖ్య మైనదని బైబిలు పండితులు చెబుతుంటారు. ఈ అధ్యాయంలో ప్రభువు తన ప్రార్థనలో, ఆయన దర్శనం, హృదయం, ఆయన మనసును కుమ్మరించిన వైనం మనం చూడవచ్చు.

1-5 వచనాల్లో చూస్తే ఆయన నిరీక్షణతో ఆకాశంవైపు కన్నులెత్తి, ఈ భూమి మీద తనకిచ్చిన పనిని నెరవేర్చి ఆయనను మహిమపరచిన సందర్భంగా...

ప్రభువు జీవితం తండ్రిని మహిమపరచింది.

ప్రభువు చేసిన అద్భుతాలు తండ్రి మహిమకే

ప్రభువు సిలువ కార్యం తండ్రి మహిమకే

అయితే ఇప్పుడు ఆయన విశ్వాసం, ఫోకస్‌కు ప్రతిఫలంగా తన కుమారుని మహిమపరచమని తండ్రిని అడిగాడు.

6 నుండి చివరి వచనం వరకు శిష్యుల కొరకు, వారి పరిచర్య ద్వారా ప్రభువులోకి వచ్చే భవిష్యత్తు విశ్వాసులందరి కొరకు ప్రార్థన చేస్తున్నాడు. ఆయనకున్న దర్శనం ఏమంటే:

**ఎ. సంఘం గుర్తింపు వ.6లో:** ఆయనను ఎరిగిన ప్రజలు ఆయనవారై ఉండాలని ప్రార్థన. ఎందుకంటే ఆయన తన స్వరక్తమిచ్చి సంఘాన్ని కొన్నాడు. కాబట్టి సంఘం యొక్క గుర్తింపు యేసుప్రభువే తప్ప ఇక ఏ నిర్మాణము, డినామినేషన్ కాకూడదు.

**బి. సంఘం లోకసంబంధులు కాకూడదని. వ. 13-16లో:** వారిని లోకములోనుండి తీసికుపొమ్మని ప్రార్థన చెయ్యలేదు గానీ లోకములో ఉంటూ లోకానికి వేరై ఉండాలని, అలా ఉండడానికి అడ్డుపడే దుష్టునినుండి వారిని కాపాడమని ప్రార్థించాడు.

**సి. సంఘం వాక్యమనే సత్యమందు ప్రతిష్టించ బడాలని వ. 19లో:** యేసుక్రీస్తులో ప్రత్యక్షపరచబడిన సత్య వాక్యానికి సంఘం నమ్మకంగా ఉండాలని, వాక్య సత్యంలో వారు ప్రతిష్టించబడాలని, వారి జీవితానికి, నడకకు వాక్యం అధికారంగా ఉండాలని ప్రార్థించాడు.

**డి. సంఘం ఆయనలో ఏకమైయుండాలని. వ. 21లో:** ఒక ప్రక్క సత్యం విషయంలో రాజీపడకుండా త్రిత్వంలో ఉన్న ఐక్యత సంఘం కనపరచాలని. ఆయన కోరుకొనే ఏకత్వంలో ప్రభువు ద్వారా సంపూర్ణులుగా చేయబడేటట్లు దేవుడు ఆయనను పంపాడని లోకము తెలుసుకోవాలని ప్రార్థన చేశాడు.

**ఇ. ప్రేషిత సంఘంగా ఉండాలని. వ. 18:** తండ్రి కుమారుని పంపినట్లు, నేను మిమ్మల్ని పంపుతున్నాను అని శిష్యులతో చెబుతూ చేసిన ప్రార్థనలో సంఘాన్ని పంపించే ప్రక్రియను వ్యక్తపరిచాడు.

ప్రభువులాంటి ప్రార్థన జీవితం మనం నేర్చుకోవడం, అలవరచుకోవడం మనకు సవాలు. మనం కూడా ప్రభువులా ప్రతి విషయంలో ప్రార్థన ద్వారా దేవునిమీద ఆధారపడడం, మన దర్శనాన్ని నెరవేర్చమని తండ్రిని వేడుకోవడం ఎంత అవసరమో కదా!

శిష్యులు ఆనాడు అడిగినట్లు మనం కూడా యుక్తంగా ప్రార్థన చేయడం నేర్పించమని అడుగుదాం. ఆయనే చెప్పాడుగా పదే పదే అడగమని. ఆచరణాత్మంగా చేయడానికి లేఖనంలో ఏదైనా పద్ధతి కన్పిస్తుందా అంటే మరలా ప్రభువే మనకు మాదిరి.

మత్తయి 14:23లో. వచనాల్లో ప్రభువు ఒక పద్ధతి అలవరచుకొన్నాడు. సమూహాలను, శిష్యుల ను పంపేశాడు. అప్పటికే అలసిపోయినా ఆయన రాత్రంతా కొండ ఎక్కి ప్రార్థన చేశాడు. పరిచర్యకు సమయాన్నిచ్చాడు. ఐదువేల మందికి బోధించి ఆహారం పెట్టాడు, శిష్యులను అద్దరికి పంపి మధ్యలో వారిని కలుసుకున్నాడు. అంటే శిష్యులకు సమయయాన్నిచ్చాడు. ఒక క్రమమైన శృతిలయ ఆయన జీవితంలో స్పష్టంగా కన్పిస్తుంది. అంటే ప్రార్థనకు, శిష్యులకు, పరిచర్యకు సమయాన్ని ఇస్తూ చక్కటి సమయపాలనకు మాదిరిగా ఉన్నాడు. కానీ ఏదో ఒకదానితో సరిపుచ్చుకోలేదు. దానియేలు జీవితంలో కూడా ఒక క్రమం కన్పిస్తుంది. అందుకే కాబోలు రాబోయే సంగతులను దానియేలుకు బాగా తెలియపరిచాడు దేవుడు.

## ప్రార్థనలో ఒక క్రమాన్ని అలవర్చుకొందాం

మనం ఒక క్రమాన్ని అలవర్చుకొందాం. ఈ క్రమంలో ఆయనలోని తీవ్రమైన కోరికను, మనసు-

ను, హృదయాన్ని కలిగి ప్రార్థన చేద్దాం. ప్రభువు లాంటి ప్రార్థనా జీవితం మన దైనందిన జీవితంలో భాగమైపోవాలి. అందుకే ఇటీవల మనం దీర్ఘకాలిక ప్రణాళిక–2030లో వ్యక్తిగతంగా, కుటుంబంగా, సహవాసంగా, ప్రార్థనాస్ఫూర్తిని పెంపొందించాలని ప్రాధాన్యతగా ఎంచి, చర్చించి, ఎన్నో నిర్ణయాలు చేశాము. అయితే ఈ తీర్మానాలు ఏ దశలో ఉన్నాయి? ప్రార్థించడంలో నేర్చుకొనే స్థాయిలో ఉన్నామా? మెంటర్ లెవల్లో ఉన్నామా? లేక వృద్ధిపొందించే స్థాయిలో ఉన్నామా? ఆలోచించాలి. ఎందుకంటే ప్రార్థన విశ్వాసికి అత్యంత ప్రధానమైన అవసరం అని బాగా గుర్తించాలి. దాన్ని అలవరచుకొని, అభ్యాసం చేస్తూ, కొనసాగించాలి. మనం ప్రార్థన ద్వారా ఆయన కృపపై ప్రతి రోజూ ఆధారపడతాం, ఆయన మహిమ కోసం జీవిస్తాం. కాబట్టి అనుదిన ప్రార్థన క్రమానికి కొన్ని సూచనలు.

**1. మన అనుదిన ప్రార్థనలు లేఖనాల్లోని దేవుని ప్రత్యక్షత, దేవునితో మనకున్న అనుభవజ్ఞానములో నుంచి రావాలి:** మన మనసు, హృదయం, చిత్తం మిళితమవ్వాలి. ఈ విషయాలు బైబిల్లోని భక్తుల ప్రార్థనల్లో స్పష్టంగా చూస్తాము. ఉదా: నెహెమ్యా ప్రార్థన చూస్తే దేవునితో తనకున్న అనుభవజ్ఞానం, లేఖనాల్లో తన దేవుడు ఏమైయున్నాడో అనే గ్రహింపునుండి ప్రార్థించాడు. మన దేవుడు సజీవుడు, సమర్థుడు, నీవాడనే గ్రహింపులేకుండా ప్రార్థనను ఒక ఆచారంగా చేసే ప్రమాదం చాలా ఉంది.

దేవుని పట్ల మనకు అవగాహన ఎంత బాగా ఉంటే మన ప్రార్థనా జీవితం అంత ఎక్కువ ప్రాభావం ఉంటుంది.

**2. పాపాన్ని ఒప్పుకోవడం, ఆయన చిత్తానికి లోబడడం:** ఎప్పుడైతే ప్రార్థనలో దేవుని ఔన్నత్యాన్ని, పరిశుద్ధతను, శక్తిని చూడడం మొదలు పెడతామో ఆయన ముఖకాంతిలో మన రహస్య పాపం అంత స్పష్టంగా కన్పిస్తుంది. అప్పుడు మనలో ఉన్న పరిశుద్ధాత్ముడు ఒప్పించినప్పుడు ఆయన దగ్గర ఒప్పుకొంటాం, ఆయన చిత్తానికి లోబడతాం. యెషయా ప్రవక్త ఒప్పుకోలు (యెషయా 6:5–8) చాలా స్పష్టంగా ఉంటుంది.

**3. చింతించకుండా కృతజ్ఞతతో కూడిన ప్రార్థనా జీవన శైలి ( ఫిలిప్పీ 4:6–13):** పాపాన్ని గూర్చిన నిజమైన ఒప్పుకోలు తీసుకువచ్చిన మార్పును బట్టి మన హృదయం తేలికై ఆయన పట్ల, మన మార్పు కొరకు ప్రార్థించిన వారిపట్ల కృతజ్ఞతను వ్యక్తపరుస్తాము. మన నిత్య అవసరాలు, శోధనలో, సంబంధాల ను సరిచేయగల దేవునికి విన్నవించుకొంటూ సమస్తజ్ఞానానికి మించిన సమాధానము అనుభవిస్తూ దేవునికి కృతజ్ఞత చెల్లిస్తాం (ఫిలిప్పీ 4:6–13)

**4. ప్రభువు మనసుతో ఇతరుల కొరకు విజ్ఞాపన చేయడం (లూకా 23:34–43):** దేవుని అనుదిన ప్రత్యక్షత మన బాధ్యతను గుర్తుచేస్తుంది. ఇతరుల పట్ల శ్రద్ధతో, కనికరముతో ఇతరుల పక్షంగా దేవునికి విజ్ఞాపన చేస్తాం. దీనికి పౌలు మంచి ఉదాహరణ. ప్రభువు కూడా తండ్రి కుడిపార్శ్వమున కూర్చొని మన కొరకు విజ్ఞాపన చేస్తున్నాడు. ఇతరుల రక్షణ పట్ల ఆయన హృదయం అర్థం చేసుకొంటే మనం కూడా విజ్ఞాపన చేస్తాం.

**వ్యక్తిగత పరిశీలనకు ప్రశ్నలు:**

1. నేను ప్రార్థనను ప్రాధాన్యతగా ఎంచు కొంటున్నానా? ప్రార్థనకు నిర్థిష్టమైన సమయం నాకున్నదా?
2. నా ప్రార్థన అలవాటైన ఆచారంలోనుండి వచ్చిన పదాలతో ఉందా? లేక వాక్య ప్రత్యక్షతలోనుండి, పరిశుద్ధాత్ముని సహాయంలోనుండి పదాలు వస్తు న్నాయా?
3. నా ప్రార్థన నన్ను దేవుని చిత్తాన్ని, ప్రణాళికను గుర్తించడానికి, లోబడడానికి నడిపిస్తున్నదా? లేక దశ, దిశను గమనించలేని ప్రార్థనలుగా ఉండిపోతున్నాయా?
4. శారీరక, ఆధ్మాత్మిక అవసరాల కొరకు ప్రార్థించి జవాబు పొందినప్పుడు ప్రార్థనలో దేవునికి, మనుష్యులకు కృతజ్ఞత తెలియజేసేవిగా ఉంటున్నాయా?
5. నా ప్రార్థనలు కేవలం 'నేను, నా కుటుంబం' కోసమే అన్నట్లు ఉంటున్నాయా? లేక ఇతరుల కోసం (తోటి విశ్వాసులు, అవిశ్వాసులు, బాధపెట్టేవారు, మనపట్ల శత్రు స్వభావంతో ఉన్నవారు) ప్రేమతో ప్రార్థించి, ప్రయాసపడేవిగా ఉంటున్నాయా?

– బి. రంగనాథం, వైజాగ్



ప్రత్యేకం

# వారి ప్రార్థన మనకు ఆశీర్వాదం

**సమయం:** అమెరికా కాలమానం ప్రకారం రాత్రి 8.30గం॥

**స్థలం:** ఓవల్ ఆఫీస్, వైట్ హౌస్

11, సెప్టెంబర్ 2001, ప్రెసిడెంట్ జార్జ్. డబ్ల్యు. బుష్ అమెరికా ప్రజానికాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగం ఆనాటి తీవ్రవాద దాడుల్లో ట్విన్ టవర్స్, పెంటగాన్ తదితర ప్రదేశాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి ఆప్తులలోను, బిక్కుబిక్కుమంటూ కాలాన్ని గడుపుతున్న అమెరికన్స్‌లోనూ చాలా ధైర్యాన్ని నింపింది. ఆయన తన ప్రసంగంలో 'కీర్తనలు 23'లోని "గాడాంధకారంపు లోయలలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను, నీవు నాకు తోడైయుందువు..." వచనాన్ని గుర్తుచేస్తూ ధైర్యాన్ని నూరిపోశాడు. అంతేకాక దేశంలో పునర్నిర్మాణ చర్యలు ప్రారంభించబోయే ముందుగా సెప్టెంబర్ 13న 'నేషనల్ డే ఆఫ్ ప్రేయర్' ను ప్రకటించారు. ఆ సమావేశంలో బిల్లీ గ్రహంగారు ఎంతో ఉద్వేగంతో ప్రసంగించి ప్రార్థించారు. ఆ ప్రార్థన ఆ దేశ ప్రజల్లో చాలా ధైర్యం నింపిందనీ, ఆ తర్వాతి దినాల్లో ఆదివారం చర్చ్ సర్వీస్‌లకు హాజరయ్యే వారి శాతం గణనీయంగా పెరిగిందనీ అనేక సర్వేల్లో తేలింది. దేవుడు తన బిడ్డలలో ప్రార్థన ద్వారా అనాదినుంచి ధైర్యాన్ని నింపుతూ, తానున్నాననే నమ్మకాన్ని కలిగిస్తూనే ఉన్నాడు.

యూదులు తమ దైనందిన జీవితంలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం కలిపి రోజుకు మూడు సార్లు ప్రార్థన చేస్తారు. ఈ ప్రార్థనలు సహజంగా సమాజ మందిరాలలో లేదా గృహాలలో నిర్వహిస్తారు. వీరు ప్రార్థన కోసం ఒక పుస్తకాన్ని రాసుకున్నారు. దాని పేరు 'సిద్దుర్'. దాని అర్థం 'క్రమం'. 'టాల్మాడిక్' కాలం నుంచి వీరు దీనిని వాడుతున్నారు. (టాల్మడ్ అనగా వారి మత గ్రంథమైన 'తోరా' మీద వేలాది రబ్బీలు రాసిన వ్యాఖ్యానాలు, చేసిన బోధలు). బైబిల్లో మోషే, యెహోషువా, యోబు, దావీదు, సొలోమోను, యోనా మొదలైన వారి ప్రార్థనలు ప్రస్తావించబడ్డాయి. నేటికీ యూదులు ప్రార్థనను నిష్ఠగా చేస్తుంటారు. ఉదాహరణకు వెయిలింగ్ వాల్ దగ్గర వారు ఇప్పటికీ ప్రార్థనలు చేస్తుంటారు. అలాగే ఆది అపోస్తలులు, క్రైస్తవులు ప్రార్థనను చాలా బలమైనదిగా, ముఖ్యమైనదిగా ఎంచారు.

సంఘ చరిత్ర ప్రారంభం నుంచి 'ప్రార్థన' అనే ప్రక్రియ విశ్వాసులను వీరులుగాను, ధైర్యవంతులనుగాను నిలబెట్టింది, నిలబెడుతూనేవుంది. ఆది

అపోస్తలులు ప్రభువునుంచి నేర్చుకొని తమ విశ్వాస ప్రయాణంలో ప్రార్థనను అతి ప్రాముఖ్యమైన భాగంగా ఎంచారు. ఆది సంఘం కూడా దానిని ప్రశస్తమైన ఉపకరణంగా తనలో ఇముడ్చుకుంది. ఆ తర్వాత వారు దానిని విరివిగా బోధించారు, పాటించారు. 'అపోస్తలుల కార్యాల గ్రంథంలోని ఆది సంఘం ప్రార్థనా సంఘంగా పేరు పొందింది'.

ఆది సంఘం మొదటినుంచి తనలో కొన్ని బలమైన సాంప్రదాయాలు ఏర్పరచుకుంది. వాటిలో ముఖ్యమైనవి 'ప్రార్థన, సువార్త ప్రకటన, సహవాసం, బోధించుట, బాప్తీస్మం, రొట్టె విరచుట, ఐక్యత, గృహకూడికలు, సమిష్టిగా పంచుకోవడం, ఆత్మీయ వరాల అభ్యాసనం, మొదలైనవి. వీటిలో ప్రార్థనను అతి ప్రాముఖ్యమైనదిగా ఎంచారు. ప్రభువు కూడా వారికి ప్రార్థన గురించి చాలా సందర్భాలలో బోధించారు. స్వయంగా వారితో కలిసి ప్రార్థించారు, దాదాపు ముప్పైసార్లకు పైగా సువార్తల్లో యేసు ప్రార్థన గురించి శిష్యులకు బోధించినట్లు చూస్తాము.

ఆది సంఘ వివరాలను మనకు ముఖ్యంగా తెలియజేసేది బైబిల్లోని అపోస్తలుల కార్యముల గ్రంథంలోని 28 అధ్యాయాలు ఉంటే దానిలో 20 అధ్యాయాల్లో ప్రార్థన యొక్క ప్రస్తావన, ప్రార్థనల ద్వారా వారు చవిచూసిన అద్భుతాలు ఉన్నాయి. ఆది అపోస్తలులు, ఆది సంఘ విశ్వాసులు తాము చూసిన లేదా పొందుకొన్న ప్రతి అద్భుతం వెనుక, వారు నిర్వహించిన ప్రతి కార్యం వెనుక ప్రార్థన ఉన్నట్లు అపోస్తలుల కార్యముల గ్రంథంలో లూకా పేర్కొన్నాడు. వారు చేసిన ప్రార్థన మూడు రకాలుగా వారికి సాయపడింది.

### 1. దిశానిర్దేశం చేసింది

"నిజమైన ప్రార్థన అంటే ఏం చేయాలో దేవునికి చెప్పడం కాదు గానీ, మనలో, మన ద్వారా తన చిత్తాన్ని నెరవేర్చమని దేవునిని కోరడం" – ఆర్.ఏ. టోరీ

ఆ దినం ప్రభువు ఆరోహణుడై వాళ్ళ కళ్ళ ముందే వెళ్ళిపోయాడు. ఏం జరుగుతుందో అని ఇంకా చూస్తూనే ఉన్నారు. దూతలు ఆయన మరల తిరిగి వస్తాడని చెప్పారు. ప్రభువు వారికి బోధించినట్లు యెరూషలేములోనే ఉండి తండ్రి యొక్క వాగ్దానం కొరకు కనిపెట్టాలని నిర్ణయించుకొని వారు ఎక్కడైతే పస్కా విందును ఆచరించారో ఆ మేడగదిలోనే



కూడుకొన్నారు. వారితో యేసు తల్లి, సహోదరులు కూడా ఉన్నారు. తదుపరి వారేం చేయాలనే దాని గురించి ప్రార్థిస్తున్నారు. పన్నెండవ అపోస్తలుని ఎన్నుకున్నారు, పరిశుద్ధాత్ముని పొందుకున్నారు, పేతురు ప్రసంగంతో నూట ఇరవై మంది కాస్తా మూడువేల మందికి పైగా శిష్యులు అయ్యారు. ఆది సంఘం ప్రారంభమైంది. 'సంఘం చేసిన ప్రార్థనకు ముందు ఏక మనస్సుతో, ఏకాత్మతో, ఎడతెగక అనే పదాలు లూకా రాశాడు'. అపోస్తలులను జైల్లో వేసినప్పుడు సంఘం ఎడతెగక ప్రార్థించింది, జైలు నుంచి విడుదల కాగానే దేవుని వాగ్దానాల నెత్తి పట్టి ధైర్యంగా సువార్త ప్రకటించేటట్లు, మా నోరు తెరవమని గొప్ప ప్రార్థన చేశారు. (అపో.కా 4). చర్చిలో అంతర్గత సమస్యలు ఉత్పన్నమైనపుడు కూడా వారు ఏం చేయాలనే దాని కోసం ప్రార్థించి పరిచారకులను ఏర్పరిచారు.(అ.కా 6). పౌలు దమస్కు మార్గంలో ప్రభువును ఎదుర్కొన్న తరవాత దమస్కులో తనేం చేయాలనే దాని గురించి ప్రార్థించాడు.(అపో. కా 9). రోమా మిలటరీ ఆఫీసర్ కొర్నేలీ తన ఇంట్లో, పేతురు మిద్దెపైన ప్రార్థనలు దేవుని చిత్తాన్ని కనిపెట్టడానికే (అపో. కా 10). పేతురును చంపడానికి హేరోదు పస్కా పండగ సమయంలో అరెస్ట్ చేసినప్పుడు (అప్పటికే యాకోబును చంపించాడు) కూడా సంఘం అత్యాసక్తితో ప్రార్థించింది.(అ.కా 12). ప్రార్థన ద్వారా వారు దేవుని సన్నిధిని అనుభవించారు, దేవుని చిత్తాన్ని తెలుసుకొన్నారు, దేవుని నడిపింపును పొందారు.

అపోస్తలుల కాలం మన కాలం కంటే చాలా ప్రమాదకరంగా ఉండేది. ఘోరమైన హింసలు, తీవ్రమైన అణచివేత, భయంకరమైన శిక్షలు, అనుకోని విధంగా ఎదురయ్యే దాడులు, ప్రభుత్వం, తోటి ప్రజల నుంచి ఎదుర్కొన్నారు. అయినా ప్రార్థన వారిని దేవునితో నడిచేటట్లు, ధైర్యంగా పరిచర్య చేసేటట్లు చేసింది.

## 2. అన్యజనులకు ఆశీర్వాదకారణంగా చేసింది

"అపోస్తలులు, ఆది క్రైస్తవులు చేసిన ప్రార్థన ఆనాటి ప్రజలకే కాదు ఈనాటి మనందరి రక్షణకు కూడా కారణమైంది"

యొప్పే పట్టణంలో సీమోను ఇంటిపైన ప్రార్థన చేసుకోవడానికి పేతురు వెళ్ళాడు. ఆ రోజు ప్రభువు దర్శనం పేతురు గుణ లక్షణాలను, భావజాలాన్ని పూర్తిగా మార్చివేసింది. "పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీకిచ్చెదను.."(మత్త 16:19) అని ప్రభువు పేతురుతో చెప్పాడు. పేతురు మొదట యూదులకు, అ తర్వాత సమరయులకు తాళాన్ని తెరిచాడు, ఇప్పుడు అన్యప్రజలకు తెరుస్తున్నాడు. కొర్నేలీ ప్రార్థన, పేతురు ప్రార్థన రెండూ అన్యజనులకు ఆశీర్వాద కారణమైంది.(అపొ.కా 10).

దేవుడు అన్యజనుల రక్షణ కొరకు పౌలును ఎన్నుకొన్నాడు. దమస్కులోని తిన్ననిదనబడిన వీధిలోని యూదా ఇంటిలో పౌలు ప్రార్థిస్తున్నపుడు, అననీయాకు ప్రభువు దర్శనములో పౌలు గురించి '... అన్యజనుల యెదుటను, రాజుల యెదుటను ఇశ్రాయేలీయుల ఎదుట నా నామము భరించుటకు ఇతడు నేను ఏర్పరచుకొనిన సాధనమైయున్నాడు' అని ప్రభువు తెలియజేశాడు.(అ.కా 9). సిరియాలోని అంతియొకయ సంఘంనుంచి పౌలును, బర్నబాను ఉపవాస ప్రార్థనతో మిషనరీస్‌గా పంపారు. ఆ కాలంలో యెరూషలేము ఒక ఆధ్యాత్మిక కేంద్రంగాను, సిరియాలోని అంతియొకయ మరొక ఆధ్యాత్మిక సంఘంగా వెలుగొందింది. అంతియొకయ సంఘం వారు చేసిన ప్రార్థన, ఉపవాసాలు ఆసియా, ఐరోపాలోను క్రీస్తు సువార్త అన్యజనుల మధ్య, యూదుల మధ్య సువార్తను అందించడానికి కారణమైంది. పౌలు మిషనరీ ప్రయాణాలన్నీ ప్రార్థనతోనే ప్రారంభమయ్యాయి. ప్రార్థనతోనే సాగాయి. ఐరోపాలోని ఫిలిప్పీ పట్టణంలో యూదులు నదీ తీరంలో ప్రార్థించేవారు. ఆ ప్రార్థనా సమయంలో పౌలు అందించిన సువార్తద్వారా లూదియ హృదయాన్ని దేవుడు తెరిచాడు.

పౌలు, సీలలను జైలులో వేసినప్పుడు కూడా వారు పాటలు పాడుతూ ప్రార్థించినప్పుడు ఖైదీలు, జైలు అధికారి రక్షణ పొందారు. పౌలు తన తర్వాతి తరానికి ప్రార్థించడం నేర్పించాడు. ఫిలిప్పీ సంఘానికి ఉత్తరం రాస్తూ మీ గురించి తిమోతి లాగా ప్రార్థించేవారు ఇంకెవరూ లేరు అని రాశాడు. దీన్ని బట్టి ఆది సంఘ అపోస్తలులు, విశ్వాసులు ప్రార్థనే తమ ముఖ్య సాధనంగా చేసుకున్నారు. పేతురు, యోహాను, పౌలు తమ పత్రికలలో ప్రార్థనావాసరత గురించి ఎన్నో విషయాలు ఆయా సంఘాలకు, విశ్వాసులకు రాశారు. ఆది సంఘ విశ్వాసులు ఇళ్ళలో, జైళ్లలో, సమాజ మందిరాలలో, దేవాలయాల్లో, నదీ తీరాల్లో, ఎక్కడ స్థలం దొరికితే అక్కడ ప్రార్థించేవారు.

## 3. దేవుని శక్తిని చూపింది

"మీ శక్తికి సమానమైన పనుల కోసం ప్రార్థించకండి, మీ పనులకు సమానమైన శక్తి కోసం ప్రార్థించండి" – ఫిలిప్ బ్రూక్స్.

ఓ రోజు మేడ గదిలో వారందరూ ప్రార్థిస్తూ ఉండగా ప్రచండమైన గాలి వీస్తున్న శబ్దం, కానీ గాలి లేదు. జ్వలిస్తున్న అగ్ని నాలుకలు వలే విభాగించబడి ఒక్కొక్కరి మీద వాలడం వారు చూశారు. అంతలో ఒక్కొక్కరు ఒక్కో భాషలో దేవుని గొప్ప కార్యాలను వివరించడం గమనించారు.అంతవరకు ఎప్పుడూ మాట్లాడని పేతురు లేచి అద్భుతంగా సువార్త చెప్పినప్పుడు దాదాపు మూడువేల మంది రక్షణ పొందారు. ఇప్పుడు వీరంతా కలిసి ప్రార్థిస్తూ ఉండగా అనేక మహాత్కార్యములు, సూచకక్రియలు అపోస్తలుల ద్వారా జరిగాయి. పుట్టు కుంటివానిని స్వస్థపరచిన సందర్భంలో పేతురు సువార్త చెప్పినప్పుడు దాదాపు పురుషులే ఐదువేల మంది రక్షణ పొందారు.

హేరోదు యకోబును చంపించి యూదుల మెప్పు కోసం పేతురును కూడా అరెస్ట్ చేసి సైనికులతో కలిపి సంకెళ్ళతో బంధించి జైలులో వేసినప్పుడు సంఘమంతా ఏక మనస్సుతో ఎడతెగక ప్రార్థించినప్పుడు అద్భుత రీతిగా బయట పడ్డాడు. జాన్ మార్క్ ఇంటి దగ్గర జరుగుతున్న ప్రార్థనలో పాల్గొన్నవారికి

తనను కనపరచుకొని వెళ్లిపోయినపుడు వారు దేవుని వాగ్దానాలను (కీర్త 2) ఎత్తి ప్రార్థించారు.

యోహానును పత్మాసు ద్వీపంలో ఒంటరిగా, నిరాధారంగా విడిచిపెట్టారు. ఆ ద్వీపంలో ఆయన చేసిన ప్రార్థన క్రైస్తవ నిరీక్షణను దేవుడు చూపించడానికి మూలకారణమైంది. దాన్ని బట్టే మన అంతిమ గమ్యం ఎలా ఉండబోతుందో మనం తెలుసుకోగలుగుతున్నాం. గనుక "జీవితం సాఫీగా సాగిపోవడం కోసం ప్రార్థించవద్దు" అని అంటాడు ఫిలిప్ బ్రూక్స్.

అపోస్తలులు ప్రార్థించినప్పుడు ఒక్కొక్కరిలో పరిశుద్ధాత్ముడు ప్రవేశించడం వారి కళ్ళారా చూశారు. అన్నిటికంటే ముఖ్యంగా తీవ్రమైన శ్రమలు, బాధలు వచ్చినప్పుడు ఎవరైతే వాటికి కారణమయ్యాడో అతనే క్రీస్తు విశ్వాసి కావడం వారికి ఆ దినాల్లో ఒక నమ్మలేని నిజం. అతను గొప్పగా దేవుని సేవ చేయడం అతి పెద్ద ప్రార్థనా విజయం వారికి. పేతురు ప్రార్థించినప్పుడు దోర్కా బతకడం, పుట్టు కుంటివాడు లేచి నడవడం, పేతురు నీడ పడితేనే స్వస్థతలు జరగడం, వేలాదిమంది రక్షణ పొందడం, పౌలు మిషనరీ ప్రయాణాలు, చరిత్రలో మొదటిసారి సువార్తను యూరప్ ఖండానికి తీసుకెళ్ళడం, అనేక దేశాలకు సువార్త వ్యాపించడం ఇవన్నీ ఆది సంఘ ప్రార్థనా విజయాలు. దేవుని గొప్ప కార్యాలను కన్నులారా చూశారు. దేవుని శక్తిని అనుభవించారు. కాబట్టే శ్రమలలో, ఇబ్బందులలో, ఇరుకులలో వెనుదిరగ లేదు, మరణాన్నైనా ఆనందంగా ఆహ్వానించారు. దేవుని కొరకు నిలబడ్డారు.

## మన బాధ్యతేంటి?

ప్రార్థన ద్వారా నీవు నేను ప్రపంచాన్ని ప్రభావితం చేయగలగడమే దేవుని ప్రణాళిక. ప్రార్థన ద్వారా జరగబోయే స్పైకాన్‌లలో స్పీకర్స్ పక్కన నిలబడి (అజ్ఞాతంగా) వారిని బలపరచవచ్చు, వారి ద్వారా అనేక మందిలో దేవుడు తన ఆత్మకార్యం చేయడానికి నీవు దోహద పడవచ్చు. ప్రార్థన ద్వారా డిసెంబర్‌లో అమెరికాలో జరగబోయే 'అర్బానా మిషన్స్ కాన్ఫరెన్స్'ను అనేక మందికి ఆశీర్వాదంగా చేయవచ్చు. అక్టోబర్‌లో జరగబోయే నేషనల్ మిషన్స్ కాన్ఫరెన్స్‌లో అనేక మందితో దేవుడు మాట్లాడేటట్లు నీ ప్రార్థన సాయపడవచ్చు. ప్రార్థనతో ఉక్రెయిన్‌లో యుద్ధంలో గాయపడిన శిశువును



నీ చేతిలోనికి తీసుకోవచ్చు. ఆసుపత్రిలో చాలా కాలంనుంచి మంచం మీద ఉన్న నిర్భాగ్యులకు స్వస్థత చేకూరేటట్లు నీ ప్రార్థనతో పోరాడవచ్చు. నీ ప్రార్థనతో యుఇయస్ఐ-ఏపి ఎగ్జిక్యుటివ్ కమిటీని బలపరచవచ్చు, దేవుని చిత్తాన్ని వారు అమలు చేసేటట్లు వారికి సాయాన్ని అందించవచ్చు. పరీక్షలు రాసేవారి పక్కన కూర్చొని వారి చేతిని బలపరచవచ్చు.

చరిత్రలో అలాంటి ప్రార్థనా యోధులు ఎంతోమంది ఉన్నారు. యేసు సొంత సహోదరుడు యాకోబు తన జీవితాన్ని మోకాళ్ళ ప్రార్థనకు అంకితం చేశాడు. చనిపోయినప్పుడు ఆయన మోకాళ్ళు చూసినప్పుడు అవి కాయలు కాసి ఒంటె మోకాళ్ళవలె ఉన్నాయి. అందుకే ఆయన్ను 'ఒంటె మోకాళ్ళ వాడు' అనేవారు. రెడ్ఇండియన్ల మధ్య మిషనరీగా పనిచేసినబ్రైనార్డ్ కన్నీళ్ళ ప్రార్థన ఆ దేశంలో గొప్ప ఉజ్జీవానికి కారణమైంది. ఇండియా కు వచ్చిన మిషనరీ 'ప్రార్థించే హైడ్' ప్రార్థనలు, డేవిడ్ లివింగ్ స్టన్ ప్రార్థన, ఆఫ్రికా దేశాలు క్రీస్తును తెలుసుకోడానికి ద్వారాలు తెరిచాయి.

కాబట్టి నీవు నేను చేసే ప్రార్థన మన తర్వాతి తరాలకు ఆశీర్వాద కారణమవుతుంది. నీ సొంత ప్రార్థనా సమయం నీకుందా! లేనట్లయితే నేడే అనుకూల సమయం. నీ సొంత ప్రార్థనకు ప్రణాళిక వేసుకో.

ప్రార్థన వారిని దేవునికి మరింత దగ్గర చేసింది
ప్రార్థన వారికి దేవుని శక్తిని చూపింది
ప్రార్థన వారిని పూర్తిగా మార్చేసింది
ప్రార్థన వారి దృష్టికోణాన్ని నిర్దేశించింది
ప్రార్థన సామాన్యులను అసామాన్యులుగా చేసింది
వారి ప్రార్థన ప్రపంచాన్ని తల్లకిందులు చేసింది

**– బత్తుల జేసన్,** చీరాల

ప్రత్యేకం



# కుటుంబ ప్రార్థన

తండ్రి బాగా డబ్బున్నవాడు, వ్యాపారి. ఎంత డబ్బు కావాలో అంత డబ్బు ఆ యువకునికి దొరుకుతుంది. దాంతో ఇష్టానుసారంగా జీవించడం ప్రారంభించి, తండ్రికి, ఇంటికి దూరమై.... బ్రతుకును నాశనం చేసుకొని, దారి తప్పి జీవిస్తున్నాడు. ఒక ఇంటిలో కొంతమంది కూర్చొని క్రీస్తును స్తుతిస్తూ, ప్రార్థిస్తూ ఉండగా ఆ ప్రార్థనకి దారి తప్పి పతనమైపోయిన ఈ యువకుణ్ణి ఎవరో తీసుకొని వెళ్ళారు. ఆ ఇంటిలో అందరూ కలిసి ప్రార్థన చేస్తున్నప్పుడు ఆ యువకుడు నెమ్మదిగా ఆ ఇంటిలోకి వచ్చి, వాళ్ళు కూర్చున్న విధంగా నెమ్మదిగా మోకాళ్ళ మీద కూర్చున్నాడు. వాళ్ళు కలిసి ప్రార్థన చేస్తున్నప్పుడు, కలిసి పాటలు పాడుతున్నప్పుడు.. ఆ యువకుని మదిలో ఓ ప్రశ్న? నా జీవితంలో ఎప్పుడూ పొందని ఆనందం, నెమ్మది, సంతోషం.. ఈ గృహంలో ఎలా సాధ్యం అవుతుంది? అని ఆలోచిస్తూ, ఈ ఇంట్లో దేవుని సన్నిధి ఉన్నదని గ్రహించాడు. తర్వాత తన పాపాల్ని ఒప్పుకొని దేవునిని అంగీకరించి, తన జీవితాన్ని క్రీస్తుకు అంకితం చేసుకొన్నాడు. ప్రభువా..! నన్నేమి చెయ్యమంటావో చెప్పు జీవించినంత కాలం నీ కొరకే జీవిస్తాను అని ప్రార్థించాడు. ఆ యువకుడు క్రీస్తు ప్రేమను పొందుకొన్న తరువాత, ఆ ప్రేమను చూపించడానికి అనేకమంది పేదవారిని, అనాధల ను చేరదీశాడు. ఒక వైపు సువార్తను ప్రకటిస్తూనే, మరొక వైపు అనేక వేలమందికి ఆహారాన్ని పెట్టి ప్రపంచ చరిత్రలో ఒక విశ్వాస వీరునిగా... పది వేల మందికంటే ఎక్కువగా ఉన్న అనాథ పిల్లలకు ఆత్మీయ తండ్రిగా మారాడు. ఆ యువకుడే జార్జ్ ముల్లర్. జార్జ్ ముల్లర్ క్రీస్తు బిడ్డగా మారిన కారణం – ఒక ఇంటిలో యేసు ఉన్నాడు. ఆ ఇంటిలో ఆరాధన, ప్రార్థన ఉంది. ఆ ఇంటిలో ఉన్న దేవుని సన్నిధి, దేవుని శక్తి, పాడైపోయిన జార్జిముల్లర్ జీవితాన్ని మార్చివేసింది.

### కుటుంబ ప్రార్థన అంటే?

కుటుంబ ప్రార్థన అనగా క్రైస్తవ కుటుంబములోని సభ్యులందరు ప్రతిదినం దేవుని సన్నిధికి వచ్చి

పాటల ద్వారా ఆయనను ఆరాధించి, వాక్యమును చదివి, దానిని క్లుప్తంగా ధ్యానించి, అర్థవంతమైన ప్రార్థనలో గడపడం.

## కుటుంబ ప్రార్థన ప్రాముఖ్యత

కుటుంబ ప్రార్థన అనేది క్రైస్తవ జీవితంలో అతి ప్రాముఖ్యమైనది, అతి విలువైనది. కుటుంబంతో కలిసి ప్రార్థించకపోతే కలిసి జీవించలేరు. యేసు ప్రభువు - ఇద్దరు ముగ్గురు నా నామం పేరట ఎక్కడ కూడి ఉంటారో వారి మధ్యలో నేను ఉంటాను అని చెప్పాడు. ఇంటిలో ఉన్న వారందరూ కలిసి ప్రార్థిస్తే ప్రభువు అక్కడ ఉంటాడు. ఇంటిలో దేవుని వాక్యం ఉంచుకొని ధ్యానించకుండా, ప్రార్థించకుండా ఉంటే ఏమి ప్రయోజనం. కలిసి ప్రార్థించడం ద్వారా ప్రభువు మన ఇంటిలో కలిగి ఉంటాడు. యేసయ్య మన ఇంటిలో లేకపోతే అది నరకమే.

ప్రతి ఒక్కరికి జీవితంలో కుటుంబం మొదటి ఆధ్యాత్మిక శిక్షణా కేంద్రం. ముఖ్యంగా చిన్న బిడ్డలకు ఆధ్యాత్మిక శిక్షణ ఇవ్వగలిగే సమయం, స్థలం. ఈ దినాలలో పిల్లలను దైవిక భయంలో పెంచడం ఒక పెద్ద సవాలు. మీడియా, సెల్‌ఫోన్, చెడు స్నేహితుల ప్రభావంతో సతమతమవుతున్నారు. బాలుడు నడువవలసిన త్రోవను వానికి బాల్యమందే నేర్పుము, వాడు వృద్ధుడైనను దానినుండి తొలగిపోడని సామె. 22:6లో రాయబడింది. నీవు నీ యింట కూర్చుండునప్పుడు, త్రోవను నడుచునప్పుడు, లేచినప్పుడు వాటిని గూర్చి మాట్లాడుచు వాటిని మీ పిల్లలకు నేర్పవలెనని ద్వితీయోపదేశకాండం 11:19లో ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించబడింది. బిడ్డలకు దైవ భయం నేర్పించగలిగే ప్రశస్త సమయం కుటుంబ ప్రార్థన.

## కుటుంబాలపై సాతాను దాడి ఉంటుంది

దేవుని పరలోకపు ఉద్దేశాలు భూలోకంలో నెరవేరడానికి దేవుడు ఏర్పరచుకొన్న వ్యవస్థ కుటుంబం. ఆదినుండి దేవుడు కుటుంబాలను ఏర్పరచి వారితో సహవాసం చేయడానికి ఇష్టపడ్డాడు. కుటుంబం దేవుని చిత్తంలో కట్టబడి ఆయనకు విధేయత చూపిస్తే ఆ కుటుంబం ఆశీర్వదించబడి, అనేకులకు దీవెనకరంగా ఉంటుంది. అందుకే దేవుని వాక్యంలో వివాహానికి, దైవ కేంద్రిత కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వబడింది. యేసు ప్రభువు బండ మీద కట్టబడే ఇల్లు గురించి తెలియజేశారు. తుఫానులు, వరదలు, గాలులు వీచినా అట్టి ఇల్లు నిలిచి ఉంటుంది. కుటుంబాలకు క్రీస్తు అనే పునాది ఉంటే వారి మీదికి వచ్చే ప్రతి శోధనకు వారు నిలుస్తారు. యుఇయస్ఐ ఆశించే ఫలితాలు ఆ కుటుంబం నుండి క్రైస్తవ సంఘాలకు, సంస్థలకు, సమాజానికి విస్తరిస్తాయి. ప్రభువును రక్షకునిగా, దేవునిగా, ప్రభువుగా ఎరిగిన యవనులు దేవుని చిత్తం తెలుసుకొని వివాహంలో జతపరచబడితే ఆ పునాది గట్టిగా ఉంటుంది. ఇసుక మీద కట్టే ఇల్లు త్వరగా కూలిపోతుంది. ఈ రహస్యము సాతానుకు బాగా తెలుసు, కాబట్టి వాడు క్రైస్తవ కుటుంబాలను గురి చేసుకొని వాటిని కూల్చడానికి పని చేస్తున్నాడు. "సాతాను తన అగ్ని బాణాలను ఏ నామకార్థ క్రైస్తవులపై ఉపయోగించి అనవసరంగా వృథా చేసుకోడు" అని జార్జి వర్వర్ చెబుతాడు. యుఇయస్ఐ సహవాసంలో బలమైన క్రైస్తవ కుటుంబాలు కట్టబడడానికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. దానికి కారణం అలాంటి మంచి క్రైస్తవ గృహాలు వారికి ఆశీర్వాదం, దేవుని యొక్క రాజ్య నిర్మాణానికి దోహదపడతాయి.

## కుటుంబ ఆశీర్వాదానికి మూలం

ఆశీర్వాదకరమైన క్రీస్తు కేంద్రిత కుటుంబాలను ఎలా నిర్మించుకోగలం? ఎలా దేవునిలో బలపరచుకోగలం? గొప్ప దైవజనుడు బిల్లీ గ్రాహం గారు వారి పరిచర్య ప్రభావవంతంగా ఉండడానికి మూడు రహస్యాలు చెప్పారు. అవి 1.ప్రార్థన, 2.ప్రార్థన, 3.ప్రార్థన. ప్రభువు తన శిష్యులకు ప్రార్థన ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రార్థన వలననే తప్ప మరి దేని వలనను ఇది సాధ్యం కాదని ఒక సందర్భంలో తెలియజేశారు. ఇయు పరిచర్యలో ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్ దేవునితో ప్రతిదినం ప్రశాంత సమయం గడపాలని ప్రోత్సహిస్తాం. అయితే కుటుంబంగా దేవుని సన్నిధిలో ప్రార్థనలో గడపడం, కుటుంబానికి ఎంతో ఆశీర్వాదకరం.

## కుటుంబ ప్రార్థన ఎవరు నడిపించాలి?

భార్య, భర్త, పిల్లలు ఇంటిలో ఉన్న వారందరూ కుటుంబ ప్రార్థనలో పాల్గొనాలి. భర్త ఒక ఆధ్యాత్మిక నాయకుడుగా కుటుంబ ప్రార్థనకు అందరిని ప్రోత్సహించాలి, నడిపించాలి. భర్త ఏ

కారణంచేతనైనా అట్టి బాధ్యత తీసుకోపోతే భార్య ప్రోత్సహించాలి. ఇది ప్రభువుతో కుటుంబంగా గడిపే గొప్ప సమయం. ఎన్నో పనుల ఒత్తిడులు, పిల్లల చదువులు, ఇద్దరూ ఉద్యోగస్తులుగా ఉండడం వలన అందరూ కలిసి ప్రార్థనలో కలుసుకోవడం కొన్నిసార్లు సవాలుగానే ఉండవచ్చు. అయినప్పటికీ కుటుంబ ప్రార్థన ప్రాముఖ్యత ఎంతో గొప్పది.

## బైబిల్లో మాదిరి కలిగిన కుటుంబాలు

**మోషే:** మోషే చిన్నవాడుగా కొద్దికాలం రాజకుమార్తె అనుగ్రహం ద్వారా పెంచబడడానికి తన తల్లి చేతికి అప్పగించబడ్డాడు. తన భవిష్యత్‌లో తీసుకొనబోయే ప్రాముఖ్య నిర్ణయాలకు తగిన తర్ఫీదు, ప్రోత్సాహం కుటుంబంలోనే పొందాడు. మోషే పెద్ద వాడైనప్పుడు విశ్వాసాన్ని బట్టి ఐగుప్తు ధనంకంటే క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని ఎంచుకొని, అల్పకాల పాప భోగం అనుభవించడంకంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించడం మేలని యెంచి ఫరో కుమార్తె కుమారుడు అని అనిపించుకొనుటకు ఒప్పుకోలేదు (హెబ్రీ 11:26). మోషేకు అట్టి తర్ఫీదు కుటుంబంగా దేవునితో గడిపే సమయంలో లభ్యమైందని గ్రహించవచ్చు.

**యోబు:** యోబు ప్రతి దినము తన కుమారులు పాపము చేసి హృదయంలో దేవుని దూషించారేమోనని వారిని పిలిచి వారిని పవిత్రపరచి అరుణోదయమున లేచి వారిలో ఒక్కొక్కని నిమిత్తం దహనబలి అర్పించాడని యోబు 1:5లో చూస్తాం. మన ఇంటి చుట్టూ ప్రహరీగోడ వేసుకొంటాం. అది మన ఇంటికి ఒక కంచెలాగా భద్రత కొరకు నిర్మిస్తాం. అలాగే యోబు ప్రార్థన, ఇంటి వారికి కంచెవలె ఉందని గమనించగలం. ప్రార్థన లేని ఇల్లు పైకప్పులేని ఇంటితో సమానం. పైకప్పు లేకపోతే దుమ్ము, ధూళి, గాలి, ఎండ, వాన ఇవన్నీ ఇంటిలోనికి వచ్చి రోగాలను కలుగజేసి చివరకు ప్రాణాలను కూడ పోగొట్టుకోవలసి వస్తుంది.

**కొర్నేలీ:** అన్యుడైన కొర్నేలీ సహితము భక్తిపరుడుగా ఉండి తన ఇంటి వారందరితో కూడా దేవుని యందు భయభక్తులు కలిగి ఎల్లప్పుడు ప్రార్థన చేసే అనుభవం కలిగినట్లు అపో. 10:2లో చదువుతాం. ఇంటివారి ని భయభక్తులలో నడిపించడానికి అనువైన స్థలం కుటుంబ ప్రార్థనే. దేవుని యందు భయభక్తులు కలిగియున్న కుటుంబం ఎలా ఆశీర్వాదకరంగా ఉంటుందో కీర్తనలు 128లో చూడగలం. అచ్చట పిల్లలు ఒలీవ మొక్కల వలె, భార్య ఫలించు ద్రాక్షవల్లి వలే ఉండునని రాయబడింది. కుటుంబం దేవుని యందు భయభక్తులు కలిగి యున్నప్పుడు ఇతరులకు ఆశీర్వాదముగా ఉండి, సువార్త అందించగలు గుతుంది. కొర్నేలీ పేతురును పిలిపించి ముఖ్య స్నేహితులను, బంధువులను ఆహ్వానించినప్పుడు వారు దేవుని వాక్యము విని అంగీకరించినట్లు గ్రహిస్తాం.

**అబ్రాహాము:** దేవుడు అబ్రాహామును పిలిచినప్పుడు తన కుటుంబంతో దేవుడు చూపించే ప్రదేశానికి వెళ్ళాడు. అతడు వెళ్ళిన చోట్ల దేవునికి బలి పీఠాలు కట్టాడు. దేవునితో తన కుటుంబాన్ని ఐక్యపరిచాడు. అతడు బేతేలుకు, హాయికిని మధ్య గుడారం వేసి యెహోవాకు బలిపీఠము కట్టి యెహోవా నామమున ప్రార్థన చేశాడు (ఆది. 12:8). తరువాత దేవుడు అబ్రాహామును ఆత్మ సంబంధమైన, భూసంబంధమైన ఆశీర్వాదాలతో నింపినట్లు మనం చూస్తాం. అబ్రాహాము దేవుని స్నేహితుడుగా పిలవ బడ్డాడు. అబ్రాహాము, శారాలు అనేక జనములకు తల్లిదండ్రులుగా పిలవబడ్డారు.

## కుటుంబ ప్రార్థన ఎప్పుడు, ఎంత సమయం, ఎలా?

కుటుంబ ప్రార్థనకు ఉదయము గాని, సాయం త్రము గాని అనుకూలము. చాలా కారణాల దృష్ట్యా ఉదయము కంటె సాయంత్రమే మంచిది. కాని పిల్లలు పడుకొనే సమయంలో కుటుంబ ప్రార్థన జరపడం సరికాదు. కుటుంబ సభ్యులందరి అనుకూలతను పరిగణలోనికి తీసుకొనవలెను. దీనికి ఖచ్చితమైన నియమమేదీ లేదు. కాని సమయం మరీ ఎక్కువగా గాని, లేక మరీ తక్కువ గాని ఉండరాదు. 30 నిమిషాల వరకు ఉత్తమం.

తల్లిదండ్రులు ఆహ్లాదకరమైన సులభతరమైన వాతావరణాన్ని సృష్టించాలి. హాజరైన ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చూడాలి. ప్రార్థించి, పాటలు పాడి, క్రమముగా బైబిలునుండి ఒక వాక్యభాగాన్ని తీసి చదవాలి. ఈ సమయంలో కుటుంబములోని ప్రతి ఒక్కరు వారి చేతులలో స్వంత బైబిలు కలిగి ఉండాలి. చిన్న వాక్య భాగాన్ని పఠి ంచాలి. ఆలోచింపచేసే ప్రశ్నలు అడగాలి. వ్యక్తిగత

అభిప్రాయాలు సున్నితంగా తెలుసుకోవాలి. ప్రతి ఒక్కరు వాక్యభాగములోని మూల అంశాన్ని రాబట్టాలి. ప్రతి వచనాన్నీ చదువుతూ, సందర్భాన్ని కోల్పోకుండా వాక్యభాగం యొక్క సరైన అర్థాన్ని గ్రహించాలి. జ్ఞానయుక్తంగా చర్చిస్తూ, వాక్యభాగం నుండి వాగ్దానాలు, సూచనలు, ఆజ్ఞలు వెలికి తీసుకురావాలి. గ్రహింపగలిగే భాషలో మన స్వంత జీవిత పరిస్థితులకు అన్వయింప చేయాలి. రోజుకు ఒకరుచొప్పున ప్రార్థన చేస్తూ కుటుంబ ప్రార్థనను ముగించాలి. వీలైనంత వరకు దీర్ఘ ప్రార్థనలు ఈ సమయంలో చేయకూడదు. ఇతరుల గురించి ప్రార్థి ంచడం, విజ్ఞాపన చేయడం ద్వారా పిల్లలు కూడా దీనిని అలవరచుకొంటారు. సంఘము, దేశము, ఇతర ముఖ్య ప్రార్థనాంశాల గురించి ప్రార్థించాలి.

## కుటుంబ ప్రార్థన ప్రయోజనాలు

కుటుంబ ప్రార్థన – కుటుంబమంతా దేవునితో సహవాసంచేసే ప్రశస్థ సమయం. కలిసి దేవుని వాక్యము ధ్యానించడానికి, కుటుంబ అవసరతలు కొరకు ప్రార్థించడానికి అనువైన సమయము. కుటుంబానికి కావలసిన నడిపింపు పొందగలిగే సమయం. ఒకరినొకరు క్షమించుకొని సమాధానపడే సమయం. కుటుంబపరంగా గాని, ఉద్యోగపరంగా గాని, పరిచర్య పరంగా గాని, ఎన్నో ఒత్తిడిలకు గురి అవుతుంటాం. అలాంటి సందర్భాలలో చిరాకు, అసహనంతో ఒకరిపై ఒకరు కోపపడే పరిస్థితులు కలుగవచ్చు. అయితే కుటుంబ ప్రార్థనలో వాటిని సరిచేసుకొనే అవకాశం ఉంటుంది. కుటుంబంలో ఇంకా ప్రభువుని నమ్ముకొనని వారు కుటుంబ ప్రార్థనలో దేవుని వాక్యం విని ప్రభువుని విశ్వసించే అవకాశాలు కలుగుతాయి. కుటుంబ ప్రార్థనల ద్వారా చుట్టూ ఉండే కుటుంబాలకు సంతోష సువార్త సునాదాలు వినిపించవచ్చు. కుటుంబంలో దేవుడు చేసే మేళ్ళనుబట్టి దేవుని మనసారా స్తుతించవచ్చు.

## మా అనుభవం

మా అమ్మమ్మ గారిని నేను ఎన్నడూ మరచిపోలేను. నాకు సుమారు 2 సంవత్సరాల ప్రాయంలో మా తండ్రిగారు మరణించారు. మాకు సహాయంగా ఉండడానికి మా అమ్మమ్మ, తాతయ్య మా ఇంటికి వచ్చారు. మా ఇంటిలో ఎవరూ ప్రభువును ఎరుగని సమయంలో మా అమ్మమ్మ మాకు కుటుంబ ప్రార్థన అలవాటు చేసింది. అవసరతలను బట్టి మా అందరి చేత ప్రార్థన చేయించింది. నా చేత ఈ చిన్న ప్రార్థన చేయించేది – "యేసయ్యా మాకు ఈ లోకంలో తండ్రి లేదు, నీవే మాకు తండ్రివి, మా అవసరతలు అన్నీ మీరే తీర్చండి ఆమెన్". ఈ ప్రార్థనలు నా జీవితంలో తీవ్ర ప్రభావాన్ని చూపాయి. కళాశాలలో ఉన్నప్పుడు నేను ప్రభువును నా రక్షకునిగా తెలుసుకొన్నాను. ఇ.యు. పరిచర్య ఆధ్యాత్మికంగా ఎదగటానికి సహాయపడింది. నా వివాహమైన తర్వాత మా గృహంలో కుటుంబ ప్రార్థన కలిగియున్నాం. అనేక క్లిష్ట సమయాలలో దైవ నడిపింపు పొందుకున్నాము. 1987లో నా సతీమణి ప్రేమలత తుని నుండి రాజోలుకు సమీపంలో ఉన్న లూటుకుర్రు అనే మారుమూల ప్రాంతానికి బదిలీ అయినది. అక్కడికి వెళ్ళడానికి 9 గంటలు పట్టేది. అప్పటికి మా పిల్లలు జోయ్ (6), శ్యామ్ (4), యానీ(3) సంవత్సరాల వయస్సు గలవారు. మేము బిడ్డలతో కలిసి ఆమె తిరిగి తునికి బదిలీ కావాలని ప్రార్థించే వాళ్ళం. మా పిల్లలు – మా మమ్మీని తిరిగి తునికి రప్పించండి యేసయ్యా అని ప్రార్థించేవారు. నెలరోజుల్లో తిరిగి తునిలో అదే స్కూల్‌కు బదిలీ అయ్యింది. మా బిడ్డలు ప్రభువుని నమ్ముకొని ఇ.యు. పరిచర్యలో బలపడి దేవుని చిత్తంలో వివాహాలు చేసుకొన్నారు. కుటుంబ ప్రార్థనల ప్రభావాన్ని ఎరిగిన వారుగా ఇప్పుడు వారి కుటుంబాలలో కుటుంబ ప్రార్థనలు కలిగియున్నారు.

యెహోషువా – ఇశ్రాయేలు జనాంగానికి దేవుడు చేసిన గొప్ప కార్యాలు జ్ఞాపకం చేస్తూ ఆయనను సేవించడానికి, వెంబడించడానికి ప్రోత్సహించాడు. అదే సమయంలో తన బలమైన నిర్ణయాన్ని వారి ముందు ప్రకటించాడు. మీరు ఎవరిని సేవింప కోరుకొనినను, నేనును, నా ఇంటి వారును యెహోవాను సేవించెదము అని తెలియజేశాడు. (యెహో. 24:15) యెహోషువా వలె నేడు మన యు.ఇ.ఎస్.ఐ. కుటుంబాలు దేవుని సేవించుటకు, మన కుటుంబాలను ప్రార్థనతో కట్టుకోడానికి ఆసక్తి కలిగి ఉందాం. తద్వారా యు.ఇ.యస్.ఐ. దర్శనం మన కుటుంబాల ద్వారా నెరవేరుతూ క్రైస్తవ సంఘానికి, సమాజానికి ప్రయోజనకరంగా ఉంటుంది.

– కె. యోహాన్, తుని



# ఉపవాస ప్రార్థన

## దేవునికి మరింత దగ్గరవ్వడానికి

ఇప్పుడైనను మీరు ఉపవాసముండి కన్నీరు విడుచుచు దు:ఖించుచు మన:పూర్వకంగా తిరిగి నాయొద్దకు రండి. ఇదే యెహోవా వాక్కు. మీ దేవుడైన యెహోవా కరుణావాత్సల్యములుగల వాడును, శాంతమూర్తియు అత్యంతకృపగల వాడునైయుండి, తాను చేయనుద్దేశించిన కీడును చేయక పశ్చాత్తాపపడును గనుక మీ వస్త్రములను కాక మీ హృదయములను చింపుకొని ఆయనతట్టు తిరుగుడి. ఒకవేళ ఆయన మనస్సు త్రిప్పుకొని పశ్చాత్తాపపడి మీ దేవుడైన యెహోవాకు తగిన నైవేద్యమును పానార్పణమును మీకు దీవెనగా అనుగ్రహించును; అనుగ్రహింపడని యెవడు చెప్పగలడు? - యోవేలు 2:12-14.

తన ప్రజలు పాపమును విడిచి, తమ్మునుతాము తగ్గించుకొని, తనవైపుకు తిరిగి ఆ మహా ఉగ్రత నుండి తప్పించుకొనుటకు వారు ఉపవాస దినమును ప్రతిష్ఠించాలని హెచ్చరిస్తూ తెలియజేసిన మాటలు.

### ఉపవాస ప్రార్థన అంటే ఏమిటి?

ఉప అంటే 'దగ్గరగా', వాసం అంటే 'నివసించడం'. ఉపవాసం అంటే దగ్గరగా నివసించడం. అంటే దేవునికి దగ్గరగా నివసించడం అని అర్థం.

'దేవుని సన్నిధిని దీక్షతో వెదకడం, దేవునికి దగ్గరవ్వడం, ఎటువంటి ఆటంకాలు, అరమరికలు లేకుండా ఆయన సన్నిధిని అనుభవించుట' అని సాధారణంగా చెప్పుకోవచ్చు. దేవునికి దగ్గరయ్యే క్రమములో ఆయనకు, మనకు అడ్డు వచ్చేవాటిని పక్కనపెట్టి ఏకాగ్రతతో ఆయనతో సమయం గడపడం ఉపవాస ప్రార్థన అని అనవచ్చు. ఆయనకు. మనకు ప్రార్థనలో ఏవి అడ్డుగా వస్తాయి? భోజనం, టి.వి., సెల్‌ఫోన్, సోషల్ మీడియా, న్యూస్ పేపర్ మొదలైనవి. వీటిని పక్కనపెట్టి ఆయన సన్నిధిలో గడపాలి.

### ఉపవాస ప్రార్థనకు ఎలా సిద్ధపడాలి?

ఉపవాస ప్రార్థన చేసేటప్పుడు ఒక నిర్దిష్టమైన గురి కలిగి ఉండటం మంచిది. అంటే ఏయే అంశాల కోసం ప్రార్థించాలని అనుకొంటున్నావు. ఉజ్జీవం కొరకా?, స్వస్థత కొరకా?, దేవుని ఉద్దేశాలు నీ జీవితంలో నెరవేర్చబడడం కొరకా?, ఆందోళనలో ఉన్న పరిస్థితులు చక్కబడటానికా?, ఆత్మీయంగా పదే పదే ఓడిపోతున్న నీవు జయజీవితాన్ని పొందడానికా, రహస్య పాపాలను విసర్జించటానికా లేదా ఫ్యామిలీ ఫ్రెండ్స్ ఆత్మల రక్షణార్థమా... ఇలా నిర్దిష్టమైన అంశాలను ఎంచుకోవాలి.

- ఒక నిర్ధిష్టమైన రోజు లేదా సమయాన్ని ఎన్నుకోవాలి. ఎన్ని రోజులు, ఎంత సమయం. ఒక పూట, ఒక రోజు, మూడు రోజులు, ఏడు రోజులు, పది రోజులు... నలభై రోజులా అని నిర్ణయించుకోవాలి.
- ఎలాంటి ఆటంకం లేని స్థలం. ఇంటిలోనా, మరి ఎక్కడైనా
- దేవునికి మనకి మధ్యలో అడ్డువచ్చే పాపాలు ఒప్పుకొని విడిచిపెట్టడానికి నిర్ణయించుకోవాలి.

  నా పేరు పెట్టబడిన నా జనులు తమ్మునుతాము తగ్గించుకొని ప్రార్థన చేసి నన్ను వెదకి తమ చెడు మార్గములను విడిచినయెడల, ఆకాశము నుండి నేను వారి ప్రార్థనను విని, వారి పాపమును క్షమించి వారి దేశమును స్వస్థపరచుదును. – 2 దిన 7:14.

  ... మీ దోషములు మీకును మీ దేవునికి అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను. యెషయా 59:1

  నా హృదయములో నేను పాపము లక్ష్యము చేసిన యెడల ప్రభువు నా మనవి వినకపోవును. కీర్తన 66:18.
- తరువాత ఆయనను స్తుతిస్తూ/ఆరాధిస్తూ ముందుగా అనుకున్న నిర్ధిష్టమైన అంశాల కొరకు ప్రార్థించాలి.
- అనుకున్న సమయంలో కొంత సమయం ప్రార్థనలో, బైబిల్ చదవడంలో, పాటలు పాడడంలో గడపవచ్చు.
- ఆ రోజు డ్యూటి చేస్తూ, ఇంటి పనులు చూసుకొంటూ ఉపవాస ప్రార్థన చేయడం మంచిది కాదు. నిర్ణీత సమయానికి ముందే అన్ని పనులు చక్కపెట్టుకొని దేవుని సన్నిధిలో ఆటంకం లేకుండా గడపడం మంచిది.
- సాధారణ దినాలకంటే ఎక్కువ సమయం, అంటే కనీసం 3 గంటలకు తగ్గకుండా దేవుని సన్నిధిలో గడపడం మంచిది.

## పాత నిబంధనలో ఉపవాస ప్రార్థన (వ్యక్తిగతంగా, సమూహంగా)

1. తీవ్రమైన దు:ఖాన్ని వ్యక్తం చేయడం కోసం (కష్టంలో వారి విన్నపాలు తెలియ జేసుకోవడానికి)



- హన్నా ఉపవాసం – హన్నా యెహోవా మందిరమునకు పోవునప్పుడెల్లా... భోజనం చేయక... బహు దు:ఖాక్రాంతురాలై వచ్చి యెహోవా సన్నిధిని ప్రార్థన చేయుచూ బహుగా ఏడ్చుచు ప్రార్థన చేయుచుండగా... 1 సమూయేలు 1:7-11.
- ఎస్తేరు తన ప్రజలను రక్షించడానికి చేసిన ఉపవాసం- ఎస్తేరు 4:16-17.

2. దైవోగ్రతను తప్పించుకోవడానికి (పాపం పట్ల దు:ఖాన్ని, పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేయడానికి)

- దావీదు బత్షెబా ద్వారా కన్న తన బిడ్డను బతికించుకోవడానికి చేసిన ఉపవాస ప్రార్థన – 2 సమూ 12:16-17
- యెరూషలేము యొక్క ప్రాకారములు పడద్రోయబడి, దాని గుమ్మాలు అగ్నిచేత కాల్చ బడినప్పుడు... నెహెమ్యా చేసిన ఉపవాస ప్రార్థన. నెహెమ్యా 1:3-11.
- నీనివె ప్రజలు దేవుని ఉగ్రతనుండి తప్పించుకోవటానికి చేసిన ఉపవాస ప్రార్థన. యోనా 3:5-10.

## యేసుప్రభువు చేసిన ఉపవాస ప్రార్థన

- ఆయన పరిచర్య ప్రారంభించడానికి ముందు 40 దినములు ఉపవాసం ఉండి ప్రార్థించినట్లు చూడగలం. – మత్తయి 4:2.
- ఖచ్చితంగా ఉపవాసం ఉండాలి అని ఆయన ఎక్కడా చెప్పలేదు కానీ ఉపవాస సమయంలో చేయవలసిన కొన్ని సూచనలు ఇచ్చారు. మత్తయి 6:16-18.



- అలాగే ప్రార్థనకు, ఉపవాసానికి సంబంధం కలుపుతూ, ఉపవాస ప్రార్థన యొక్క ప్రాధాన్యతను తెలియజేశాడు - మార్కు 9:29.
- ఆయన ఉపవాస ప్రార్థన చేసి మనకు మాదిరిని కనపర్చాడు.

## నూతన నిబంధనలో ఉపవాస ప్రార్థన (అపోస్తులుల కాలంలో)

- అపోస్తలుడైన పౌలు అనేకసార్లు ఉపవాసం ఉన్నట్లు మనం గమనించగలం - 2 కొరింథీ 6:5, 11:27.
- ఆదిమ సంఘం పౌలు, బర్నబాలను మిషనరీలుగా ప్రత్యేకించటానికి ముందు ఉపవాసం ఆచరించినట్లు చూడవచ్చు. అ.కా. 13:3.

## నా అనుభవం

అన్య కుటుంబం నుండి దేవున్ని నమ్ముకున్న నేను ప్రతి శుక్రవారం ఉపవాసం ఉండి ప్రార్థన చేయడం నా జీవితంలో ఒక భాగం అయింది. వివాహం తరువాత నా భర్త ప్రేమ్ కుమార్, స్టాఫ్ సువార్త ప్రకటించే సమయాల్లో నేను ఇంటి వద్ద ఉండి ఉపవాస ప్రార్థన చేసేదాన్ని. ఎక్కువగా క్రిస్మస్ దినాల్లో అనేకుల రక్షణార్థం అలా చేస్తూ ఉంటాను. దీని ఫలితం మేము చూస్తూ ఉన్నాము. గత సంవత్సరం ఆయనకు కోవిడ్ వచ్చినప్పుడు ఈ సంవత్సరం నేను క్యాన్సర్‌కు గురియైన రోజుల్లో ఉపవాసం ఉండి ప్రార్థించినప్పుడు దేవుడు చేసిన అద్భుతం మనందరికి తెలిసిందే. ఇదంతా కేవలం దేవుని కృప, ప్రేమ, దయ. ప్రత్యేకంగా ఆపరేషన్ రోజు అనేకమంది చేసిన ఉపవాస ప్రార్థనలు ఆయన కనికరాన్ని పొందడానికి దోహపడ్డాయి. ఆయన మీద ఆధారపడినప్పుడు, ఆయన శరణుజొచ్చినప్పుడు ఆయన మన మనవులను ఆలకిస్తాడు. అసాధ్యాలను సుసాధ్యం చేయగలిగిన ఆశ్చర్యకరుడు.

## ఉపవాస ప్రార్థన వలన ప్రయోజనాలు

1. దేవునికి మరింత దగ్గరవ్వడానికి.
2. జీవితంలో దేవుని చిత్తాన్ని స్పష్టంగా తెలిసికోడానికి.
3. అనేక రకాలైన శోధనలు, సమస్యలు జయించి విజయవంతమైన, పవిత్రమైన జీవితాన్ని జీవించడానికి.
4. ప్రశస్తమైన, ఆగిపోయిన కార్యాలు ఆశ్చర్యంగా జరగడానికి.
5. ఆత్మల పట్ల భారం కలిగి, అనేకమందికి ఆశీర్వాదకరంగా ఉండడానికి.
6. తోటి విశ్వాసులతో, వ్యక్తులతో మంచి సంబంధ బాంధవ్యాలు కలిగి ఉండడానికి.
7. దేవుని కోపంనుండి విడిపించబడటానికి (ద్వితీ 8:3; దాని 10:9-12; లూకా 4:1-13; మలాకీ 4:2; యోనా 3:4-10

## ముగింపు

ఉపవాస ప్రార్థనలు చేసినప్పుడు దేవుడు ఖచ్చితంగా జవాబు ఇస్తాడు. అడగవలసిన రీతిగా అడిగితే తప్పక ఆయన జవాబు ఇస్తాడు. యెహోవా యందు భయభక్తులు గలవాడెవడో వాడు కోరుకోవలసిన మార్గమును ఆయన వానికి బోధిస్తాడు అని రాయబడింది (కీర్తన 25:12). ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా ఆయన చిత్తాను-సారంగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే (1 యోహాను 5:14). కాబట్టి ఆయన చిత్తానుసారంగా అడిగిన ప్రతి దానికి ఆయన తగిన సమయంలో, ఆయన విధానంలో జవాబు ఇస్తారు. ఆ జవాబు కొన్నిసార్లు 'అవును' అని రావచ్చు. కొన్నిసార్లు 'కాదు' అని రావచ్చు. లేకపోతే 'వేచియుండు' అని రావచ్చు. లేదా 'సైలెన్స్' అని కూడా రావచ్చు. ఇవన్నీ ఆయన ఇచ్చే జవాబులే. మన పరలోకపు తండ్రికి ఎప్పుడు ఇవ్వాలో, ఏమి ఇవ్వాలో, ఎవ్వరికి ఇవ్వాలో మనం అడగకముందే తెలుసు. అయినా మనం ఆయనను శ్రద్ధగా అడగడం, ఆయన శరణుజొచ్చి అడగడం, ఆయన మీద ఆధారపడటం ఆయనకి ఎంతో ఇష్టమైన కార్యం.

– కరుణా ప్రేమ్, స్టాఫ్, వైజాగ్



# మన తరానికి సేవ చేయడం

ప్రతి తరములో దేవుడు ఎన్నుకున్న వ్యక్తులకు తన ఉద్దేశాలను బయలుపరచి వారి ద్వారా వాటిని నెరవేర్చుకోవడం చూస్తాం. ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్వంలో ఉన్నప్పుడు దేవుడు తన ఉద్దేశాలు బయలుపరిచాడు, వాటి నెరవేర్పు కోసం మోషేను ఆ తరువాత యెహోషువను వాడుకొన్నాడు. సమూయేలు ద్వారా దావీదు రాజుగా అభిషేకం పొంది తన తరములో దేవుని ఉద్దేశాలు నెరవేర్చాడు. అపో.కా. 13:36లో దావీదు దేవుని సంకల్పం చొప్పున తన తరము వారికి సేవ చేసి నిద్రించి, తన పితరుల యొద్దకు చేర్చబడి అనే మాటను చూస్తాం. అ.కా. 13:22లో యెష్షయి కుమారుడైన దావీదును కనుగొంటిని; అతడు నా యిష్టానుసారుడైన మనుష్యుడు, అతడు నా ఉద్దేశములన్నియు నెరవేర్చునని చెప్పి అతని గూర్చి సాక్ష్యమిచ్చెనని, కీర్తన 78:72లో అతడు యథార్థహృదయుడై వారిని పాలించెను. కార్యముల యందు నేర్పరియై వారిని నడిపించెను అనే మాటలు దావీదును గూర్చి సాక్ష్యమిస్తూ దేవుడు రాయించటం చూస్తాం. ఒక వ్యక్తి గూర్చి, అతని సేవ గూర్చి బైబిల్లో ఇలా రాయబడిందంటే అతని జీవితం, అతని సేవ, పరిచర్య ఎంతటి సవాలుకరమైనది కాకపోతే ఇలా రాయబడి ఉంటుంది? దేవుని ఉద్దేశాల ప్రకారం తన తరానికి సేవ చేసిన దావీదులో ఉన్న కొన్ని లక్షణాలు గమనిద్దాం. ఇవి మన జీవితంలో దేవుని ఉద్దేశాల ప్రకారం మన తరం వారికి సేవ చేయడానికి మనలను నడిపించే నియమాలుగా వాటిని నేర్చుకొందాం, అన్వయించుకొందాం.

## 1. దావీదు దేవునియందు నమ్మికయుంచి ఆయనతో నడిచినవాడు

రాజైన దావీదు దేవునియందలి విశ్వాసం, ప్రేమ, భక్తి, సమర్పణతో కూడిన వ్యక్తి. దావీదు రాసిన అన్ని కీర్తనలు దేవునియందు తనకున్న విశ్వాసం, వ్యక్తిగత సంబంధం, సమర్పణను గూర్చి ప్రస్ఫుటంగా తెలియజేస్తాయి. కీర్తన 27:1లో యెహోవా నాకు వెలుగును రక్షణయునైయున్నాడు. నేను ఎవరికి భయపడుదును? యెహోవా నా ప్రాణ దుర్గము, ఎవరికి వెరతును? అనే మాటలు, కీర్తన 4:7-8లో నెమ్మదితో పండుకొని నిద్రపోదును. నేను ఒంటరిగా నుండినను నీవే నన్ను సురక్షితంగా నివసింపజేయుదువు అనే మాటలు దావీదుకి దేవునియందున్న బలమైన నమ్మకాన్ని, విశ్వాసాన్ని తెలియజేస్తాయి. అలాగే కీర్తన 63:1-2లో దేవా, నా దేవుడవు నీవే, వేకువనే నిన్ను వెదకుదును, నీ

"దేవుడు వ్యక్తులను సేవక నాయకులుగా సిద్ధపరిచే క్రమంలో మొదట వారు అందరికి తెలియనివారిగా, అందరి దృష్టిలో కొద్దివారిగా, అందరి మెప్పు, అంగీకారం లేని వారిగానే ఉంటారు" అని చక్ స్విండాల్ అంటాడు. ఇలా ఎక్కువ కాలం గుర్తించబడని, ప్రాముఖ్యతలేని స్థితిలో కొనసాగుతున్న క్రమంలోనే ఒక వ్యక్తి యొక్క గుణం రూపుదిద్దుకొంటుంది. ఇది కొంత వింతగా అనిపించినప్పటికీ ఎవరైతే మొదట ప్రాముఖ్యతలేని, గుర్తించబడని పరిస్థితిని మౌనంగా సహిస్తారో వారే ప్రజల్లో మెప్పు ఘనతను పొందుతారు. గుర్తింపు వచ్చిన తర్వాత కూడా తమ్మును తాము నిర్వహించుకోగలిగే అర్హతను పొందుకొంటారు. ఇది దావీదు జీవితంలో, పరిచర్యలో అక్షర సత్యం.

బలమును నీ ప్రభావమును చూడవలెనని పరిశుద్ధాలయమందు ఎంతో ఆశతో నీ తట్టు కనిపెట్టియున్నాను అనే మాటలు దేవుని పట్ల తనకున్న తృష్ణను వ్యక్తపరుస్తాయి.

దావీదు శత్రువులతో యుద్ధాలు చేసే సందర్భంలో దేవునియందు తనకున్న విశ్వాసం స్పష్టంగా కన్పిస్తుంది. శత్రువులపై యుద్ధానికి వెళ్ళే విషయంలో ప్రతి ఆలోచన దేవుని నుండి పొందటం చూస్తాం. 2 సమూ 2:1లో దావీదు దేవుని యొద్ద విచారణ చేయడం చూస్తాం. దావీదు రాజు దేవుని యొద్ద విచారణ చేయటం ఒక నిత్య అభ్యాసంగా, అలవాటుగా చేసుకొన్నాడు (1 సమూ 23:2-4; 30:8). దావీదు యొక్క విశ్వాసం, దేవునితో వ్యక్తిగత సంబంధం మన తరంలో దేవున్ని సేవించడానికి మనకు ఒక సవాలుతో కూడిన మాదిరి.

## 2. దావీదు దీనుడైన, సేవా నాయకత్వం కలిగిన రాజు

దావీదు బెత్లెహేములో యెష్షయి కనిష్ఠ కుమారునిగా జన్మించాడు. అతని తండ్రియైన యెష్షయి దావీదును రాజు అవ్వడానికి తగిన వ్యక్తిగా ఎంచలేదు. అతని దృష్టిలో దావీదు ఒక గొర్రెల కాపరి మాత్రమే. అయితే దేవుడు దావీదును సమూయేలు ద్వారా ఇశ్రాయేలీయులకు రాజుగా అభిషేకించాడు (1 సమూ 16:7-13). దావీదు తన దీన నేపథ్యం గూర్చి మరువక దేవుడు ఇశ్రాయేలీయులకు రాజుగా ఆయన కృపను బట్టి పిలిచాడనే విషయం గూర్చి ఎల్లప్పుడు స్పృహ కలిగియుండేవాడు. 1 పేతురు 5:6లో చెప్పినట్లు "దేవుడు తగిన కాలమందు మిమ్ములను హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన బాహువుల క్రింద దీనమనస్కులై యుండుడి" అనే నియమాన్ని అనుసరించినట్లు గ్రహించగలం.

"దేవుడు వ్యక్తులను సేవక నాయకులుగా సిద్ధపరిచే క్రమంలో మొదట వారు అందరికి తెలియనివారిగా, అందరి దృష్టిలో కొద్దివారిగా, అందరి మెప్పు, అంగీకారం లేని వారిగానే ఉంటారు" అని చక్ స్విండాల్ అంటాడు. ఇలా ఎక్కువ కాలం గుర్తించబడని, ప్రాముఖ్యతలేని స్థితిలో కొనసాగుతున్న క్రమంలోనే ఒక వ్యక్తి యొక్క గుణం రూపుదిద్దుకొంటుంది. ఇది కొంత వింతగా అనిపించినప్పటికీ ఎవరైతే మొదట ప్రాముఖ్యతలేని, గుర్తించబడని పరిస్థితిని మౌనంగా సహిస్తారో వారే ప్రజల్లో మెప్పు ఘనతను పొందుతారు. గుర్తింపు వచ్చిన తర్వాత కూడా తమ్మును తాము నిర్వహించుకోగలిగే అర్హతను పొందుకొంటారు. ఇది దావీదు జీవితంలో, పరిచర్యలో అక్షర సత్యం. దావీదు యొక్క దీనత్వం తన జీవితంలో సౌలు తనకు వ్యతిరేకంగా ఉన్నాడని, తనకు వ్యతిరేకంగ పన్నాగాలు పన్నుతున్నాడని అర్థమైనప్పటికీ సౌలుకు సేవ చేయడంలోని తన అంగీకారం, క్రియల్లో కనిపిస్తాయి (1 సమూ 18:10-16). దీనత్వం అనేది దేవున్ని సేవించే క్రమంలో మనమందరం సొంతం చేసుకోవాల్సిన అతి ప్రాముఖ్యమైన నియమం. దీనికి మంచి ఉదాహరణ యేసుప్రభువు వారే (యెష 42:1-9; ఫిలిప్పీ 2:5-11). ఈ లక్షణం మన యుఇయస్ఐ పితరులైన ప్రొ. ఇనాక్, డా. స్టెరెట్ గార్లలో, ఇతరులలో చూడగలిగినందుకు దేవునికి వందనాలు చెల్లించాల్సినవారంగా ఉన్నాము. ఇప్పుడు మనలో ఎంతమందిమి ఈ లక్షణాలను పరిచర్యలో కలిగియున్నామన్నది ప్రశ్న.

## 3. దావీదుకి విశ్వాసం, దేవునిని బట్టి ధైర్యం ఉన్నాయి

ఒక యవనస్థునిగా తండ్రి యొక్క మందను కాసే బాధ్యత తనకివ్వబడింది. దావీదును ఇశ్రాయేలీయులకు

రాజుగా సిద్ధపరచడానికి, తర్ఫీదు ఇవ్వటానికి దీనిని దేవుడు వాడుకున్నాడు. దావీదు గొల్యాతును ఒక వడిసెల రాయితో చంపడం మనందరికి తెలిసిందే. ఫిలిష్తీయులు తమ బలగాన్ని కూర్చుకొని ఇశ్రాయేలీయుల మీదకి వచ్చినప్పుడు ఫిలిష్తీయుల వీరుడు, గాతువాడైన గొల్యాతు ఇశ్రాయేలీయులకు ఒక గొప్ప ప్రమాదకారిగా ఉన్నాడు (1 సమూ 17:1-10). "ఈ దినము ఇశ్రాయేలీయుల సైన్యములను తిరస్కరించుచున్నాను.. ఒకని నియమించిన యెడల వాడును నేనును పోట్లాడుదుము" అన్న ఆ ఫిలిష్తీయుని మాటలు వింటుంటే సౌలు, ఇశ్రాయేలీయులందరూ భయకంపితులయ్యారు (1 సమూ17:10-11). అప్పుడు దావీదు రాజుకి ఎంతో ధైర్యంగా ఇలా వివరించాడు. "మీ దాసుడునైన నేను నా తండ్రి యొక్క గొర్రెలను కాయుచుండగా సింహమును, ఎలుగుబంటియును వచ్చి మందలోనుండి ఒక గొఱ్ఱె పిల్లను ఎత్తికొని పోవుచుండగా, నేను దానిని తరిమి చంపి దాని నోటనుండి ఆ గొఱ్ఱెను విడిపించితిని, అది నా మీదికి రాగా దాని గడ్డము పట్టుకొని దానిని కొట్టి చంపితిని" (1సమూ 17:34-36). ఈ సంఘటనల్లో దావీదు బలమైన విశ్వాసాన్ని దేవుని బట్టి ధైర్యాన్ని వ్యక్తపరచటం చూస్తాం. 1 సమూ 17:87లో సింహము యొక్క బలము నుండియు, ఎలుగుబంటి యొక్క బలము నుండియు నన్ను రక్షించిన యెహోవా ఈ ఫిలిష్తీయుని చేతిలో నుండి కూడా నన్ను విడిపించుననియు చెప్పాడు. అప్పుడు 1 సమూ 17:37లో రాజైన సౌలు దావీదుతో నీవు వెళ్ళు దేవుడు నీకు తోడైయుండునుగాక అని చెప్పడం చూస్తాం. 1 సమూ 17:38-39లలో దేవునియందు విశ్వాసంతో, దేవుని బట్టి ధైర్యంతో గొల్యాతును దావీదు ఎదుర్కొన్నాడు. నీవు కత్తియు, ఈటెయు బల్లెమును ధరించుకొని నా మీదికి వస్తున్నావు అని గొల్యాతు అంటే, దావీదు నీవు తిరస్కరించిన ఇశ్రాయేలీయుల సైన్యములకు అధిపతియగు యెహోవా పేరట నేను నీ మీదికి వచ్చుచున్నాను అని చెప్పి గొల్యాతును చంపి తన ప్రజలను రక్షించాడు. దావీదు అలా ఒక్క వడిసెల రాయితో ఫిలిష్తీయునిపై విజయం పొందాడు (1 సమూ 17:40-50).

మనము దేవున్ని సేవించే క్రమంలో మనకు కూడ ఫిలిష్తీయులు, గొల్యాతు లాంటి శత్రువులైన క్రైస్తవ విరోధశక్తులు సంఘం వెలుపట ఎదురవుతారు లేదా విశ్వాసుల మధ్యలోనే అసూయ, ద్వేషం, విరోధ భావంతో వుండే సౌలులాంటి వారిని సంఘంలోనే ఎదుర్కొంటాం. కాబట్టి మనకు కూడా దావీదువంటి బలమైన విశ్వాసం, ధైర్యం ఉన్నప్పుడే మన తరానికి సేవ చేసే క్రమంలో వచ్చే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోగలము.

### 4. దావీదు నైపుణ్యం కలిగినవాడు, తన ప్రజలను కాపాడినవాడు

దావీదు మంచి నైపుణ్యం కలిగి చమత్కారంగా వాయించగల గొప్ప యుద్ధవీరుడు, మాట్లాడటంలో నేర్పు కలిగినవాడు, రూపసి, దేవునితోడు కలిగినవాడు (1 సమూ 16:18). దావీదు రాసిన కీర్తనల్లో కూడా దావీదు యొక్క నైపుణ్యం కన్పిస్తుంది. అవి దావీదులోని పాటలు రాయడం, వాయిద్యాలు వాయించగల నైపుణ్యాన్ని మనకు చూపిస్తుంది. బహుశా దావీదు తన మందను మేపేటప్పుడు వాయిద్యాలు వాయించడం, దేవుని గూర్చి ధ్యానించటం నేర్చుకొని ఉండవచ్చు. క్రమంలో దేవుడు దావీదును తన తరానికి రాజుగా సేవించటానికి సిద్ధపరుస్తున్నట్లు చూడగలం. దావీదు ఒక నైతికత కలిగిన నమ్మకమైన కాపరి. తన గొర్రెల పట్ల ఎలా శ్రద్ధ కలిగియుండాలో ఎలా వాటిని కాపాడాలో బాగా తెలిసినవాడు (1 సమూ 17:34-36).

ఈ రోజుల్లో చాలామంది క్రైస్తవ నాయకులు, బోధకులు, ప్రసంగీకులు వ్యక్తిగత పరిశుద్ధత, నైతిక జీవితం కన్నా వారి వరాలు, తలాంతులు, నైపుణ్యాల ప్రదర్శన మీదే దృష్టి పెడుతున్నారు. జవాబుదారితనం, నమ్మకత్వం, యథార్థత, పరిశుద్ధత, నైతిక జీవితాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ రోజుల్లో దేవుని పరిచర్య అంటే ఒక పిలుపు, సమర్పణ కాకుండా ఒక వ్యాపారంగా అయిపోయింది. మన తరానికి సేవ చేస్తున్న మన జీవితాలు ఎలా ఉన్నాయో పరీక్షించుకుందాం.

**మిగిలినది వచ్చే సంచికలో...**

- యం. కృష్ణయ్య, యుఇయస్ఐ-ఏపి మాజీ
స్టేట్ సెక్రటరీ, హైదరాబాద్
అనువాదం: సిస్టర్. స్వాతి విక్టర్, స్టాఫ్

హెచ్చరిక




# ప్రసంగవేదికపై ప్రార్థనాలేమి

*"ప్రసంగాలు తయారు చేసుకోవడానికి ఎక్కువగా వాక్యపఠనంలో గడపడం, తద్వారా ప్రార్థనకు సమయం లేకపోవడం దేవునికీ నాకు దూరాన్ని అధికం చేసిందని" హెన్రీ మార్టిన్ రోదించాడు. తాను బహిరంగ పరిచర్య కొరకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్లుగా అర్థమై, తాను ఉపవాసంతో ప్రార్థించాల్సిన ప్రాముఖ్యతను తెలుసుకొని తన డైరీలో ఇలా రాసుకున్నాడు. 'ఈ ఉదయం నేను రెండు గంటలు ప్రార్థించాలని నిర్ణయించుకున్నాను'.*

ఒక బోధకుడు ప్రార్థించకపోతే దేవుని యొద్దనుంచి సందేశాన్ని అతడు ఎలా పొందుతాడు? దేవుని యొద్దనుంచి సందేశాన్ని పొందకపోతే ఏమి బోధిస్తాడు? ఒకవేళ బోధించినా అది సత్యమైనదిగా ఎలా ఉంటుంది? వ్యక్తుల హృదయాలను మనస్సులను అది ఎలా ప్రభావితం చేస్తుంది? ఆత్మీయ ఫలాలను ఎలా పండిస్తుంది? ప్రార్థన ద్వారా అతనిలోని విశ్వాసము సజీవంగా ఉండకపోతే, అతని ఆత్మీయ కనుదృష్టి తేటపడకపోతే, దేవునితోటి సహవాసంలో అతని హృదయం వెచ్చదనాన్ని పొందకపోతే, తాను పొందిన సందేశాన్ని అతడు శక్తివంతంగా ఎలా విడుదల చేస్తాడు?

మనం ఆత్మీయ దృష్టితో చూసినప్పుడు, ప్రార్థనాగది అనుభవంలేని ప్రసంగవేదిక కేవలం ఒక గొడ్రాలే. ఏ బోధకునికైతే ప్రార్థనాగది సన్నిహితంగా ఉంటుందో, ఆ బోధకుడు ధన్యుడు. అలాంటి బోధకుడు విస్తారమైన ఆత్మీయఫలాలను పండిస్తూ ప్రభువురాజ్యం కోసం పరుగులు తీస్తాడు.

ఒక బోధకుడు గాని క్రైస్తవుడు గాని మర్యాదతో కూడిన జీవితాన్ని జీవించవచ్చు. అయితే, మర్యాదకూ పరిశుద్ధతకూ మధ్య తూర్పుకూ పడమరకూ ఉన్నంత

దూరముంది. పరిశుద్ధత అనేది కేవలం ఏకాంత ప్రార్థన ద్వారా మాత్రమే పొందగలిగేది.

ప్రార్థన లేకుండా ఒక బోధకుడు అధికారికంగాను, ఆకర్షణీయంగాను, వినోదాత్మకంగాను, జ్ఞాన యుక్తంగాను బోధించవచ్చు. అయితే ఇలాంటి బోధకూ దేవుని అమూల్యమైన విత్తనాన్ని విత్తడానికీ మధ్య చాలా వ్యత్యాసం ఉంది.


ఓ బోధకుడా, ప్రార్థించడమెలాగో మొదట నేర్చుకో! ఏవో కొన్ని ప్రార్థనా పుస్తకాలను చదివి కాదుగాని, ప్రార్థన పాఠశాలలో దేవునియెదుట మోకరించడం ద్వారానే నేర్చుకో.

ఈ పవిత్రమైన పనిని మనం యాంత్రికంగాను ఎంత నిర్లక్ష్యంగా చేస్తున్నామోకదా! 'వ్యక్తిగత పరిశుద్ధత బోధకుని విజయానికి నాంది' అని హెన్రీ మార్టిన్ తెలుసుకున్నాడు. 'వ్యక్తిగత పరిశుద్ధతకు రహస్య ప్రార్థనే నాంది' అనికూడా అతడు తెలుసుకొన్నాడు.

ప్రార్థన, పరిశుద్ధ జీవితం ఈ రెండు ఒక్కటే. ఈ రెండు ఒకదానికి మరొకటి స్పందిస్తూ, ప్రతిస్పందిస్తూ ఉంటాయి. ఈ రెండు ఒకటి లేకుండా మరొకటి బతకలేవు. ఎందుకంటే, ఈ రెండింటిలో ఒకటి లేదంటే, ఇంకొకటి లేనట్లే. ప్రార్థనా జీవితానికి అడ్డంకులు పరిశుద్ధ జీవితానికి కూడా అడ్డంకులే.

అయ్యో, మన బోధకులు వేషధారణతో గాక నిజమైన బోధతో ప్రజలముందుకెళ్తే ఎంతబాగుంటుంది! వారు పెదవులతో గాక ఆత్మనింపుదలతో బోధిస్తే, వారి బోధలు నిర్జీవమైనవిగానూ వృత్తిరీత్యా చేసేవిగాను ఉండకుండా ఉంటే ఎంత ఎంతబాగుంటుంది! జీవాన్నిచ్చే బోధ జీవాన్నిచ్చే ప్రార్థననుండే జనిస్తుంది. బోధించడం, ప్రార్థించడం ఒకటిగా కలిసివెళ్తాయి. అవి రెండూ విడదీయజాలని ప్రాణస్నేహితుల్లా పెనవేసుకొని ఉంటాయి, ఆ రెండింటిలో ఒకటి మరణిస్తే రెండోది కూడా మరణించినట్లే.

నాజూకైన బోధనలకూ, తేనెపూసిన బోధలకూ ఇది సమయం కాదు. బోధకుడు ఒక గౌరవస్తునిగానో ఒక పండితునిగానో వేషం వేసుకొనేందుకు కూడా ఇది సమయం కాదు. దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తం, ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనోనేత్రాలకు గుడ్డితనాన్ని




కలుగజేసిన సమయం. దేవుని రాజ్యాన్ని వ్యతిరేకించే దుష్టశక్తులన్నిటినీ సమూలంగా నాశనం చేయాల్సిన సమయమిది. ధైర్యంగా, ప్రార్థించే వ్యక్తులు లేకుండా ఈ లోకాన్ని బలమైన బంధకాలతో బంధించిన చీకటి శక్తులను నాశనం చేయడం అనేది జరుగదు, నిజదేవున్ని ఎరుగని జనసమూహాన్ని నిత్యజీవపు వెలుగువద్దకు నడిపించడం అనేది సంభవించదు. ప్రార్థించకుండా క్రైస్తవులమని చెప్పుకొంటూ తిరిగే వ్యక్తులందరూ కేవలం మతం ముసుగులో ఆటలాడుకొంటున్నారు, ఆయుధాలు లేకున్నా సైనికులమని చెప్పుకొంటున్నారు. అలాంటి వారు వ్యతిరేకతతోనూ దుష్టత్వంతోనూ నిండిన ఈ లోకాన్ని మార్చేందుకు ఏవిధంగానూ పనికిరారు. నిజమైన క్రీస్తు సైనికులు, అంటే ప్రార్థించే వారు మాత్రమే ఈ అద్భుతమైన పనిని చేయగలరు.

పాపం ప్రబలిపోతుంది, సాతానుడు రాజ్యమేలుతున్నాడు, అనేకుల జీవితాలు నిరాశ నిస్పృహలతో, నిట్టూర్పులు విడుస్తున్నారు. ఎవరి కళ్ళల్లో చూసినా కన్నీళ్ళు నదుల్లా పొర్లిపారుతున్నాయి. ఇవన్నీ ఎందుకు ఇంకా కొనసాగుతున్నాయి? పాపాన్ని అంతమొందించేందుకు నీవు నేనూ ప్రార్థించనందువల్లనే!

**– ఇ.యం. బౌండ్స్**

# వెలిగిచ్చే దీపాలు



క్షణక్షణానికీ ఎక్కువవుతున్న వర్షాన్ని దాటుకొని హాస్టల్ని సమీపించాడు నిరీక్షణ్. గోడపక్కన బైక్ పార్క్ చేసి హాస్టల్లోపలికి నడిచి, వర్షానికి తడవకుండా వేసుకున్న రెయిన్ కోట్ తీసి గోడకున్న మేకుకి తగిలించి ముందుకు నడిచాడు. నిరీక్షణ్‌కి నలభై ఏళ్ళుంటాయి. పేరున్న కాలేజీలో లెక్చరరుగా పనిచేస్తున్నాడు. చదువుకునేటప్పుడు ఒక అన్న ద్వారా యేసుప్రభువును సొంత రక్షకుడిగా అంగీకరించి బాప్తీస్మం తీసుకొన్నాడు. ఎక్కడ, ఎప్పుడు, ఎలాంటి అవకాశం వచ్చినా వదులుకోకుండా సువార్తను ప్రకటించడం అలవాటు చేసుకున్నాడు. వాక్యం దీపమని నమ్ముతాడు. ఆ దీపమే లోకానికి వెలిగిస్తుందని విశ్వసిస్తాడు. ప్రత్యేకించి విద్యార్థి జీవితంలో దేవుణ్ణి సొంతరక్షకునిగా అంగీకరిస్తే మనసు ఎంత సమాధానంగా ఉంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకొన్నాడు కాబట్టి విద్యార్థుల ద్వారానే వాక్యం దీపంగా మారి లోకానికి వెలుగిస్తుందని నమ్మాడు. అందుకే ప్రతీ శుక్రవారం సాయంత్రం ఎన్ని పనులున్నా ఆ హాస్టల్‌కి తప్పనిసరిగా వచ్చి పిల్లలను ఒకచోట చేర్చి దేవుని గూర్చి చెప్తుంటాడు. ముందుకు నడుస్తున్న నిరీక్షణ్ మెట్లమీద కూర్చొని సెల్ చూస్తున్న రాఘవను చూసి ఆగిపోయాడు. అతనికి దగ్గరగా వెళ్లి "తమ్ముడూ... బాగున్నావా?" అన్నాడు.

"ఊ..." అన్నాడు రాఘవ.

"కాలేజ్‌కి వెళ్తున్నావా?"అడిగాడు నిరీక్షణ్.

"ఊ..." అన్నాడు రాఘవ.

"బైబిల్ స్టడీకి రావట్లేదు. ఏమైనా పనులుంటున్నాయా?" మళ్లీ అడిగాడు నిరీక్షణ్.

రాఘవలో అసహనం ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయినా విసుగును లోలోపలే దాచుకుంటూ "ఊ.." అన్నాడు ముక్తసరిగా.

"నువ్వు పోయినసారి ఇవాంజిలిస్టిక్ క్యాంప్‌కు వెళ్లినట్లున్నావు కదా!" అన్నాడు నిరీక్షణ్.

"ఊ.." అన్నాడు రాఘవ.

"సరే తమ్ముడూ... ఏదో పనిలో ఉన్నట్లున్నావు. మళ్ళీ కలుస్తానులే. వీలుచూసుకొని బైబిల్ స్టడీకి వస్తూండు. మానకు. ఇసిలో నేర్చుకున్నవి మననం చేసుకోకపోతే లోకంలో పడిపోతాం.." అని చెప్పి ముందుకు కదిలాడు. గేట్‌లో నుండి లోపలికెళ్ళి కుడిచేతి పక్కకు తిరిగితే మూడుగదుల అవతల తను రెగ్యులర్‌గా బైబిల్‌స్టడీ తీసుకునే రూమ్ వస్తుంది. పిల్లలంతా టవల్ చుట్టుకొని, షార్ట్స్ వేసుకుని ఎవరికి తోచినట్టు వాళ్లు కాపరిలేని గొర్రెల్లాగా తిరుగుతున్నారు. పైకి వెళ్లే మెట్లమీదా, పిట్టగోడల మీదా ఎక్కడపడితే అక్కడ కూర్చొని సెల్‌ఫోన్స్‌ల్లో బందీలైపోయారు. కొంతమంది ఏవో సినిమాపాటలు పాడుకుంటూ, మరికొంతమంది నోటికి వచ్చిన భాషంతా వాడుతూ పెద్దగా నవ్వుకొంటున్నారు. అది హాస్టల్లో, పిచ్చాసుపత్రో అర్థంకాలేదు ఒక్కక్షణం. అక్కడైతే మతిలేక తిరుగుతారు, ఇక్కడేమో మతులున్నా మైమరచి తిరుగుతుంటారు. అంతే తేడా!

తల్లీదండ్రీ దగ్గరుండరు. కార్పోరేట్ కాలేజీల్లో చదివించలేక, తాము పడుతున్న కష్టం తమ పిల్లలు పడకూడదని దూరమైనా పిల్లల్ని హాస్టల్లో ఉంచి చదివిస్తుంటారు తల్లిదండ్రులు. వచ్చిన కొత్తలో భయంభయంగానో, బెరుగ్గానో అమాయకంగా ఉన్న పిల్లలంతా సీనియర్ విద్యార్థులతో స్నేహంచేసి రెండుమూడు నెలలకే దారితప్పుతుంటారు. అందరూ వివిధ రకాల కోర్స్‌లు చదువుతూ టీనేజ్‌లో ఉన్నవాళ్ళే. ఉడుకురక్తం... మరిగేరక్తం. మనసుల్ని కలుషితం చేస్తూ మనుషుల్ని ఏ పనికైనా పురికొల్ప డానికి అవకాశం ఉన్న వయస్సు వాళ్ళది. చేతిలో డబ్బులుంటే ఖర్చుపెట్టడం, లేకపోతే ఎవరి దగ్గర డబ్బుంటే వాళ్లతో చేరిపోయి వాళ్ళు చెప్పిన పనులన్నీ చేయడం, సిగరెట్లు, అప్పుడప్పుడూ మందు, సినిమాలు,

పిచ్చిపట్టినట్లుగా వ్యసనంగా మారిపోయిన పబ్జీలాంటి గేమ్స్. తమను లాక్కెళ్లే పనుల్లో తప్ప వాళ్ల మనసును నిలకడగా ఉంచుకోవాలనే ఆలోచనే రాదు వాళ్లకి. ప్రతి శుక్రవారం ఇలాంటి దృశ్యాలు, ఆలోచనలు నిరీక్షణ్ మనసులో మెదులు తుంటాయి. తనకు అవకాశం ఉన్నంతవరకూ అక్కడ చేరిన పిల్లలకు దేవుని ప్రేమపట్ల ఆసక్తి కలిగేలా చెప్పి వాళ్లను దేవుని వైపు తిప్పడానికి ప్రయత్నిస్తుంటాడు.

"మాస్టారూ... నమస్తే!" అని వినిపించడంతో ఆలోచనలకు కళ్ళెంవేసి ఆగిపోయాడు నిరీక్షణ్. హాస్టల్ వార్డెన్ నవ్వుతూ కనిపించాడు. ఎన్ని ఒత్తిడులున్నా పెదాలపై పూసిన చిరునవ్వును చెరగనీయకపోవడం దేవుడిచ్చిన వరం. వార్డెన్‌ని చూసినప్పుడల్లా నిరీక్షణ్‌కి ఆ అభిప్రాయం కలుగుతుంటుంది. నమస్కారం చెప్పి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు నిరీక్షణ్. "బైబిల్‌స్టడీకి వచ్చారా మాస్టారూ...?" అన్నాడు నవ్వుతూ వార్డెన్. అవునన్నట్లుగా తలూపాడు నిరీక్షణ్.

"ఎందుకు సార్... మంచి ఉద్యోగం చేస్తున్నారు. వచ్చే జీతాన్ని వాడుకొంటూ భార్యాపిల్లలతో జీవితాన్ని అనుభవించకుండా ఇంత వర్షంలో ఈ వెధవల కోసం ఇంత ప్రయాసపడి వస్తారు. వాళ్లు రారు, వచ్చినా వినరు. మీ ప్రయాస వ్యర్థం కదా..." అన్నాడు తన సహజ ధోరణిలో.

"అన్నీ తెలిసినవారు మీరే అలాగంటే ఎలా సర్"? వాకిట్లో నాటిన మొక్కను మనమే జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎండనుండి, వాననుండి రక్షించుకోవాలి. నిటారుగా నిలబడడానికి దానికి కావలసిన సపోర్ట్ ఇవ్వగలగాలి. మొక్కను నాటి అలాగే వదిలేసి దానంతటదే పెరుగుతుందని అనుకోకూడదు కదా! కొంత ఎదిగే వరకైనా మనం ఇవ్వవలసిన చేయూత అన్ని విధాలుగా అందించాలి. అప్పుడే అది నిలబడుతుంది, నలుగురికి ఉపయోగపడుతుంది. ఈ పిల్లలు కూడా అంతేసార్! అంధకారంలో ఉన్నారు, అయోమయంలో ఉన్నారు. ఏది మంచో, ఏది చెడో గ్రహించలేని గుడ్డితనంలో ఉన్నారు. వాళ్లను చేరదీసి వాళ్లకోసం ప్రాణం పెట్టిన దేవుని పరిచయం చేస్తే ఒక్కసారిగా కాకపోయినా తర్వాతైనా తాను వెలుగుతాడు, పదిమందికి వెలుగు చూపిస్తాడు. ఎప్పుడైనా వెలుగుతున్న దీపమే పది దీపాలను వెలిగించడానికి ఉపయోగపడుతుంది కదా సార్..." అని చెప్పి నవ్వుతూ బయటికి వచ్చేశాడు.

నిరీక్షణ్ రాకను గమనించిన కొంతమంది పిల్లలు చాపలు పరిచి, వాళ్ల దగ్గరున్న బైబిల్స్ తెచ్చుకొని కూర్చొన్నారు. లెక్కకు పదిమంది కనిపించారు. ఇందులో వెలిగేదెవరో! తొలిగేదెవరో! నిలబడేదెవరో? పడిపోయేదెవరో? ఏదేమైనా సరే... విశ్వాసంతో ప్రార్థన చేయాలి. వీరందర్నీ దేవుడికోసం నిలబడే మంచి సైనికుల్లా, ఆరిపోని దీపాల్లా తయారుచేయాలి అనుకొన్నాడు నిరీక్షణ్. ప్రారంభ ప్రార్థన చేసి కొద్దిసేపు పాటలు పాడించాడు. కాపరిలేని గొర్రెలు ఎంతగా దారితప్పుతాయో చెప్పి నిజమైన కాపరి – యేసుక్రీస్తును కలిగివుంటే జీవితం ఎంతగా వెలిగించబడుతుందో వివరించాడు. లోకస్నేహాలు వ్యర్థమనీ, దేవుణ్ణి నిజమైన స్నేహితుడిగా కలిగివుంటే ఎన్ని లాభాలుంటాయో విశదపర్చాడు. వ్యక్తిగతంగా ఒక్కొక్కరితో మాట్లాడి వాళ్ళ సమస్యలు తెలుసుకొన్నాడు, వాళ్ళ అవసరాలు గుర్తించాడు. ప్రతీ అవసరానికి ముందు దేవునిపై ఆధారపడాలనీ, ఆ తర్వాతే మనుషుల వైపు చూడాలని ప్రేమగా చెప్పాడు. చివరి ప్రార్థన చేసి ఇంటికి బయల్దేరాడు నిరీక్షణ్.

****

శనివారం ఉదయం క్లాస్‌కు బయల్దేరబోతుండగా ఫోన్ మోగింది. స్క్రీన్ మీద రాఘువ పేరు కనిపించడంతో లిఫ్ట్‌చేసి 'హలో రాఘువా ఎలా ఉన్నావు?' అన్నాడు నిరీక్షణ్. "సార్ నేను రాఘువని కాదు... వీరబాబుని మాట్లాడుతున్నాను. రాఘువకి ఒంట్లో బాగుండకపోతే రాత్రి గవర్నమెంట్ ఆస్పత్రికి తీసుకొచ్చాము. ప్రార్థన చేస్తారని ఫోన్ చేశాను సార్..." అన్నాడు. రాఘువకి ఏమయిందోనన్న ఆందోళన చుట్టుముట్టింది ఒక్కసారిగా. "అయ్యో... అవునా! రాత్రి చెప్తే వెంటనే వచ్చేవాడిని కదా. ఇప్పుడెలా ఉంది" అన్నాడు కంగారుగా. "ఆ టైమ్‌లో చేస్తే బాగుండదని చేయలేదు... ఇప్పుడు పర్వాలేదు సార్.. బాగానే ఉన్నాడు" అన్నాడు వీరబాబు. ఫోన్ పెట్టేసి బైక్‌ని వేగంగా అస్పత్రి వైపు పోనిచ్చాడు. బెడ్ మీద పడుకున్న రాఘువని చూడగానే కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. రాఘువకు అలా ఎందుకు జరిగిందో పిల్లలు వాళ్ళకు తెలిసిన కారణాలు వాళ్ళుచెప్పారు. అన్నీ విన్న తర్వాత అసలు విషయం తెలుసుకోవాలని డాక్టర్ని కలిశాడు.

"ఆ అబ్బాయి మీకేమవుతాడో తెలియదు. సమయానికి ఆహారమూ, నిద్ర ఎంత అవసరమో మీకు తెలియనిది కాదు. ఈ అబ్బాయికి సెల్‌ఫోన్ వాడకం ఎక్కువవ్వడంవల్ల నిద్ర తగ్గిపోయింది. దానివల్ల ఆకలి మీద ధ్యాస తగ్గింది. ఆ రెండూ తగ్గడంవల్ల ఇప్పుడీ అనారోగ్యం వచ్చింది. ఇప్పటికి పర్వాలేదు, ఇకముందైనా వాటికి దూరంగా ఉంటే మంచిది.. లేకపోతే ఎప్పటికైనా ప్రమాదమే..." చెప్పి వెళ్ళిపోయాడు డాక్టర్. రాఘవ భారంగా కనులు తెరిచి ఆగి ఆగి చెప్పసాగాడు. "సార్...నిన్న మీరు వెళ్ళిన తర్వాత మెట్లమీదనుండి రూమ్‌లోకి వెళ్దామని పైకి లేచాను. ఒక్కసారిగా కళ్లు బైర్లు కమ్మినట్లుగా అనిపించింది. ఒళ్లంతా నీరసంగా ఉంది. మా ఫ్రెండ్స్‌ని పిలిచాను. ఒక్కడు కూడా అందుబాటులో లేడు, ఎవరి పనుల్లో వాళ్లున్నారు. చివరికి ఇదివరకు బైబిల్ స్టడీ కొచ్చిన వీళ్ళే నన్నిక్కడికి తీసుకొచ్చారు. సమయానికి వీళ్ళు రాకపోయినా, నాకేమైనా అయినా నా తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉండేదో ఆలోచిస్తేనే భయమేస్తుంది సార్..." అన్నాడు. కన్నీళ్ళు చెంపల్ని తాకుతున్నాయి.

పశ్చాత్తాపం మొదలైంది. పరివర్తన ప్రారంభమైంది. తన లోపాలు తాను గుర్తించాడంటే దేవుని కార్యం మొదలైనట్లే... దేవునికి దగ్గరవుతున్నట్లే! నిరీక్షణ్ ఎంతో సంతోషపడ్డాడు. అప్యాయంగా రాఘవను సమీపించి "రాఘవా... ఈ సృష్టంతా దేవుడే చేశాడు. మంచినీ చెడునూ గుర్తించమనే వివేకాన్ని మాత్రం మనిషికి ఇచ్చాడు. మనకు లోకమంతా కావాలి. కానీ అందులో మనకు అవసరమైన వాటిని గుర్తించాలి. అనారోగ్యాన్నిచ్చే వాటికి దూరంగా ఉండాలి. నువ్వు ఇసికి వెళ్ళావు. దేవుని గురించి ఎంతో నేర్చుకున్నావు. నువ్వు నేర్చుకొన్న విషయాలు నలుగురికి చెప్పాలేగానీ వాళ్ళతో పాటే లోకంలో కలిసిపోకూడదు. ఇకనైనా లోకాన్ని విడిచిపెట్టి దేవుని కోసం దీపంలా వెలుగు. నలుగురు మిత్రుల్ని ఆ వెలుగులోకి నడిపించు. దీపాన్నెప్పుడూ మంచం కిందనో కుంచం కిందనో పెట్టకూడదు, నలుగురికీ వెలుగిచ్చే ప్రదేశంలో ఉంచాలి..." అన్నాడు నిరీక్షణ్. రాఘవ కళ్లు ఆనందంతో మెరిశాయి.

**– డా. జడా సుబ్బారావు**, నూజివీడు

# Crossword Puzzle




*Please find out the hidden words in the puzzle using the clues/hints and send to Nambur office within 15 days.*

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | | | | 2 | ■ | ■ |
| ■ | 3 | 4 | | | | 5 | 6 |
| 7 | ■ | | ■ | ■ | | | |
| | 8 | | | | | | |
| | ■ | | ■ | ■ | | | |
| 9 | | | | | | | |
| | ■ | | ■ | ■ | | | |
| 10 | | | | | | | |

**Horizontal**

1. The man who wanted a blessing
3. The man who vowed to be separate
8. The man of strong conviction
9. The fifth son in 10 who hanged with his father
10. The Man who had a mind to work.

**Vertical**

2. The man who lacked self-control
4. The man who had no fear of men
5. The man who made a speech
6. The man forfeited privileges
7. The man who was a fool by name/nature

**Last month key:**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| E | L | I | M | E | L | E | C | H |
| | I | T | H | I | E | L | S | P |
| A | B | I | E | L | M | | H | A |
| | N | | T | T | U | B | A | L |
| | I | | H | | E | | M | L |
| S | A | M | U | E | L | | A | U |

1. *M. Ankarao, Guntur*
2. *R. Suma Srinivas, Guntur*
3. *Anna Mani, Pamarru*

కోశాధికారి లేఖ

# సమృద్ధిగా విత్తుదాం

క్రీస్తునందు ప్రియమైన యుఐయస్ఐ-ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామంలో వందనాలు.

కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంటకోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంటకోయును"
- 2 కొరింథీ 9:6,7

క్రైస్తవ దాతృత్వానికి సంబంధించి రెండు నియమాలు ఉన్నాయి. మొదటిగా మనమేది విత్తుతామో అది కోస్తాం. సమృద్ధిగా విత్తితే సమృద్ధిగా కోస్తాం. పౌలు ఇలా రాయడంలో ఆయన ఉద్దేశం మనకు ఖర్చుకు తగిన రాబడి ఉంటుందని లేక ఎంత ఎక్కువగా ఇస్తే అంత ఎక్కువగా పొందుతామని కాదుకానీ ప్రతివాడు తాను హృదయంలో నిర్ణయించుకొన్నది ఇవ్వాలని, అది సణుగుకోకుండా, బలవంతంగా గాక, తాను తిరిగి పొందబోయేదాన్ని అంచనా వేసుకోకుండా ఇవ్వాలి. ఎందుకంటే సంతోషంగా ఇచ్చేవారిని దేవుడు ప్రేమిస్తాడు. రెండవదిగా మనం రెండు ఉద్దేశాలతో ఇస్తాం. మొదటిది మనం తినడానికైతే రెండవది మనం తిరిగి విత్తడానికి. ఎందుకంటే పంట నూర్చే దేవుడు మన ప్రస్తుత ఆకలిని తీర్చడమే కాదు, భవిష్యత్‌లో మనకు ఆహారాన్ని దయచేయడంలోనూ శ్రద్ధకలిగి ఉన్నాడు. కనుక సమృద్ధిగా విత్తుదాం. సమృద్ధిగా పంటకోద్దాం. ప్రభువు వలన ప్రేమింపబడదాం. పరిచర్యకు సహకారులుగా ఉండడానికి సిద్ధపడదాం.

**గమనిక:** జూన్ నెల 2022లో జరిగిన రాష్ట్ర వార్షిక కౌన్సిల్ (ఏసియం 2022) నిర్ణయం ప్రకారం రాష్ట్రంలోని ప్రతీ ఇ యు, ఇజియఫ్ పరిచర్య కోసం పంపించే మంత్లీ కాంట్రిబ్యూషన్‌ను ఏ.పి. స్టేట్ అకౌంట్ కు పంపించాలని, రాష్ట్ర మరియు నేషనల్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమకూడిన మొత్తాన్ని ఎగ్జిక్యూటివ్ కమిటీ విభజించి పంపడానికి, కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి అనుమతినిస్తూ తీర్మానం చేయడం జరిగింది. కాబట్టి పరిచర్యకు ప్రతి నెలా పంపించే కాంట్రిబ్యూషన్‌ను విభజించకుండా మొత్తాన్ని ఏ.పి. స్టేట్ అకౌంట్‌కు పంపించాలని మనవి.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఐయస్ఐ-ఏపి ఏసియం-2022 తర్వాత పెరిగిన 16.53% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టెరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఐయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించారు. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,41,000/- (16.53% Hike W.R.T present income)**

**JULY 2022**

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 843.00 | Field Staff Salaries | 4,84,735.00 |
| General Fund | 9,78,459.00 | Field Staff HRA, CA, MA & TA | 2,39,597.00 |
| Staff Support | 1,75,100.00 | Office Staff Salaries | 1,72,301.00 |
| | | UESI | 80,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Office Expenditure | 16,570.00 |
| | | SWF | 1,13,000.00 |
| | | Closing Balance | 99.00 |
| **Total** | **11,54,302.00** | | **11,54,302.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-09-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# అద్భుతాలేవి ?

ఆశ్చర్యకరుడని ఆయనకు పేరు
ఆయన ప్రజలమే
కానీ మనదారి వేరు

ఆయనలో అన్నీ అసాధారణం
మన బ్రతుకులు మాత్రం
అతి సాధారణం

ఆదికాండం నుంచి ప్రకటన దాకా
అద్భుతాలకు కొదువలేదు
మన మోడరన్ వర్షన్‌లో మాత్రం
అలాంటి వాటికి తావేలేదు

వర్షాన్ని ఆపడం
చంద్రున్ని నిలపడం
మనకు ఊహించడం కూడా కష్టం
కానీ కష్టమైనవి అడిగే వారంటేనే
దేవునికిష్టం !

పాతకాలం ప్రజలంతా
పాపం అమాయకులు
అసాధ్యమని తెలీక అడిగేసేవారు
ఇప్పుడు మనమంతా జ్ఞానులం
అన్నీ ప్రాక్టికల్‌గా మాట్లాడతాం

అంద్రెయ మనకు ఆదర్శం
ఏది ఎంత మట్టుకు సాధ్యమో
లెక్కలేసి తేలుస్తాం
అయిదు రొట్టెల్ని రెండు చేపల్ని
కూడినా గుణించినా
అయిదువేలు అవడం లేదని
కాలిక్యులేటర్‌తో కుస్తీలు పడతాం!

మరీ లోతుగా వెళ్ళిన లాజిక్కు
మనల్ని దేనికోసమూ ప్రార్థించనివ్వదు
దైవ చిత్తమనేది
మనికిప్పుడు అంతుచిక్కని పజిల్
ఏదో తెలీని సందిగ్ధం
మనల్ని ఏ సాహసమూ చేయనివ్వదు

అద్భుతాలన్నీ ఇప్పుడు అటకెక్కాయి
అందించే దేవుడు లేక కాదు
అడిగే మనిషిలేక !!

– తాళ్ళూరి ప్రసాద్